శ్రీ రాఘవేంద్ర

తెగలాగే భార్య

(నవ్వుల జడ దెబ్బలు)



హాస్యబ్రహ్మ

డా॥ శంకరనారాయణ



శ్రీ రాఘవేంద్ర

తెగలాగే భార్య

(నవ్వుల జడ దెబ్బలు)



హాస్యబ్రహ్మ

డా॥ శంకరనారాయణ

2017

తీగలాగే భార్య

(నవ్వుల జడ దెబ్బలు)

రచన : హాస్యబ్రహ్మ శంకరనారాయణ
ఫోన్ : 8008333227

ముఖచిత్రం : కూచి

ప్రతులకు :

ఎస్.ఆర్. బుక్‌లింక్స్

దానయ్య వీధి, మాచవరం, విజయవాడ-4.

ఫోన్ : 0866-2436959, 81424 44988

&

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలోని అన్ని బుక్‌షాపులు

తీగలాగి చూడు

ప్రియమిత్రులారా!

మనుషులు రెండు రకాలు. నవ్వలేక ఏడ్చేవాళ్లు కొందరయితే, ఏడవలేక నవ్వేవాళ్లు మరికొందరు. నా ఏడుపు అంతా జనాన్ని నవ్వించడానికేనంటారు ప్రముఖ సినీ హాస్యనటులు శ్రీ బ్రహ్మానందం. ఏ నవ్వుకైనా ఆధారం ఈ సమాజమే. సమాజంలోని ఏ అంశం మీదనయినా హాస్యాన్ని పండించవచ్చు. వివిధ సామాజిక అంశాల మీద నేను రాసిన హాస్యరచనలన్నీ గుదిగుచ్చి ఇస్తున్నాను. ఈ పుస్తకానికి తీగలాగే భార్య అనే పేరు పెట్టాను. 2016 సం॥లో విజయవాడ పుస్తక ప్రదర్శనలో ఆకాశవాణివారు ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ వ్యాసం చదివాను. దీనికి మరికొన్ని వ్యాసాలు కలిపాను. ఈ పుస్తకంలో కొన్ని వ్యాసాలు ఈనాడు, విపుల, తెలుగు వెలుగు పత్రికల్లో ప్రచురించినవి కాగా, మరికొన్ని ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. నా రచనలు వెలుగులోకి తీసుకొచ్చిన ఆయా యాజమాన్యాలకు కృతజ్ఞతలు.

ఈ గ్రంథాన్ని ఆత్మీయులు కళాబ్రహ్మ వంశీ రామరాజు గారికి అంకితమిస్తున్నాను.

వారు నా మీద చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు.

అందంగా అచ్చువేసిన ప్రచురణకర్తలకు నా కలం నమస్కరిస్తోంది.

ఇక పాఠకులే నా పాలకులు. మీ ఇష్టం... నా అదృష్టం.

- శంకరనారాయణ

అంకితం



మూడు కార్యక్రమాలు ... ఆరు సత్కారాలు'గా

వంశీ రామరాజ్యాన్ని స్థాపించి,

దశాబ్దాలుగా పాలిస్తున్న కళాబ్రహ్మ

అనాథ బాలలకు అన్నీ తానైన సేవా బ్రహ్మ

శ్రీ వంశీ రామరాజుకు

అభిమాన పురస్సరంగా

ఆయన వీరాభిమాని

- శంకరనారాయణ

ఇందులో ......

తీగలాగే భార్య

అమ్మ బాబోయ్! అయ్య బాబోయ్! భార్య బాబోయ్! తీగలాగే భార్య చంపుకుతింటోంది.... 'కావవే వరద సంరక్షించు భద్రాత్మకా' అని ఆ మధ్య నా ఫ్రెండొకడు ఆరున్నొక్కరాగం ఆలపించాడు. 'ఏమిటిరా సంగతి ఏమిటిరా నీ గతి' అన్నాను. 'నా గుండె లబ్‌డబ్ అనికాదు, లబోదిబో అని కొట్టుకుంటున్నది' అని బావురుమన్నాడు. 'ఎవరి చెవుల్లో పువ్వులు పెడుతున్నావ్‌రా! నీ గుండె లబోదిబో అంటే నాకు వినిపించేదిగా!' అన్నాను. కాదు నా గుండెను సైలెంట్ మోడ్‌లో పెట్టాను. కనీసం వైబ్రేషన్‌లో కూడా పెట్టలేదు. అందుకే నీకు వినిపించలేదన్నాడు. 'నీది గుండా... సెల్‌ఫోనా... ఏడవకుండా విషయం చెప్పి ఏడువు' అన్నాను. 'తీగలాగే భార్య' అని మళ్ళీ నక్కినక్కి వక్కాణించేశాడు. తీగలాగే భార్య అయితే ఏడవడమెందుకురా పిచ్చి సన్నాసి! సంతోషించు నీ భార్య లతాంగి అన్నమాట. తీగ లాంటి శరీరం ఉన్న భార్య దొరకడం ఎంతటి అదృష్టం. నిరాశ్రయాం న శోభన్తే కవితా, వనితా, లతా అన్నార్రా! అందువల్ల ఆమెకు అండగా ఉండి ఆనందపడరా! అని 'ఖరీదైన' ఉచిత సలహా ఇచ్చాను. అయినా వాడి ఏడుపు తగ్గలేదు. ముదమన్నదే లేకుండా ఆముదం తాగినట్టు మొహం పెట్టాడు. అసలు

విషయం నీకు అర్థం కావడం లేదు. మా ఆవిడ తీగలాగడం వల్ల నా డొంకంతా కదిలిపోతోంది. ఎలా బతకను... ఎలా గతకను... ఎలా అతకను... అసలే నేను మెతకను అంటూ తన భార్యా పరిణామ సిద్ధాంతాన్ని, సదరు ఇంతి వృత్తాంతాన్నీ కరువు లేకుండా ఏకరువు పెట్టాడు. అది రహస్యం కాబట్టి నలుగురికి చెబుతాను. మిత్రుడి భార్య తన పతిదేవుడి గురించి ఆరా తీసింది. అతడి భాగోతాన్ని బయటపెట్టింది.

దేవుడు ప్రతిచోటా తాను ఉండలేక తల్లుల్ని సృష్టించాడంటారు. ఇది నిజం. మరి మగాళ్లను అదుపు చేయడానికి ప్రతిచోటా పోలీసుల్ని పెట్టలేక భార్యల్ని సృష్టించాడని ఒక మగానుభావుడు అనేశాడు. ఇది నిజం కాదని ఏ మహానుభావుడూ చెప్పలేదు. ఎందుకంటే గుండె ఎడమ భాగంలో ఉంటుంది. భార్య కూడా ఎడమ భాగమే కదా! వామ భాగం అంటే ప్రేమ భాగం.

మా ఫ్రెండ్ భార్య "ఎవ్వతితో చరించు, పతి ఎవ్వతె లోపల నుండు లీనమై, ఎవ్వతె తోడివిందు" అని భర్త మీద దర్యాప్తు మొదలు పెట్టేసరికి పతిదేవుడు సింపతి దొరికే దిక్కు లేక తూర్పు తిరిగి దండం పెట్టేశాడు. అంతటితో ఆమె ఊరుకోలేదు. 'అట్టి ఆత్మవిభు నా శరణంబు వేడెదన్' అనేసరికి చెట్టంత వాడు పిట్టంత అయి 'నీవే తప్ప ఇతఃపరంబెరుగ' అంటూ క్షమాపణలు కోరాడు. కాళ్ల బేరానికి వచ్చాడు. ఆ పూటకు కథ సుఖాంతమై పోయింది. మామూలుగానే అతడి పరువు తెల్లారిపోయింది.

ఇది మామూలు మగాడి కథ అనుకుంటే పప్పులో స్టెప్పువేసినట్టే. జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణ పరమాత్ముడు కూడా ఇందుకు మినహాయింపు కానే కాదు. ముక్కు తిమ్మన రాసిన పారిజాతాపహరణం కావ్యం చదివితే శ్రీకృష్ణుడి సంసారం గుట్టు రట్టు అవుతుంది. ఆయన తన పెద్ద భార్య రుక్మిణీదేవికి పారిజాత పుష్పం తెచ్చి బహూకరించాడు.

ఆయన భార్యకు ఆయన ఇచ్చుకున్నాడు.. తప్పేముంది ? అనుకోవడానికి వీలులేదు. ఇది మనుషుల విషయంలో ఓకే గానీ దేవతల విషయంలో కుదరనే కుదరదు. శ్రీకృష్ణుడి చిన్న భార్య సత్యభామకు విషయం తెలిసి అగ్గిమీద గుగ్గిలమైపోయింది. దెబ్బతిన్న పాములా బుసలు కొట్టింది. నెయ్యి పోస్తే ప్రజ్వలించిన నిప్పులాగ జబ్బ చరిచింది. ఎక్స్‌ప్రెస్ స్పీడ్‌లో కోప గృహంలోకి చేరింది. తీవ్రమైన సమ్మె మొదలుపెట్టేసరికి శ్రీకృష్ణుడు తల్లడిల్లిపోయాడు. ప్రపంచానికి దేవుడైనా పెళ్లాం దగ్గర జీవుడేగా. సత్యభామను ప్రసన్నం చేసుకోవడానికి కిష్టయ్య పడ్డ పాట్లు అన్నీ అండ్ ఇన్నీ కావు. భార్య ముందు తన పేరుతో ప్లాట్లు కొన్నంత రిస్కు. ఏమయితేనేం కృష్ణ రాయబారం లాగే ఏకాంతంలో సత్యభామ దగ్గర కూడా రాజీ ప్రతిపాదన ఫట్ అయింది. ఆమె ఎడమ కాలితో ఆయన్ను తోసేసింది. ఇదంతా నువ్వు చూశావా అంటే చూడలేదు. "జలజాతాసన వాసవాది సురపూజా భాజనం బై తనర్చు లతాంతాయుధా కన్నతండ్రి శిరమచ్చో వామపాదంబునన్ తొలగంద్రోసె లతాంగి" అని ముక్కు తిమ్మన కళ్లారా చూసినట్టు రాశాడు. శ్రీకృష్ణుడి మీద ఒట్టు. అంతా సత్యభామకున్న పట్టు. 'నను భవదీయ దాసుని మనంబున నెయ్యపు కిన్క బూని తాచినయది నాకు మన్ననయ' అని కూడా కృష్ణ పరమాత్ముడు సరెండర్ అయిపోయాడు. పురుషాధిపత్య ప్రపంచం అంటారు. కానీ పురాణ కాలంలో అది లేదని చెప్పడానికి ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్ముడు కంకణం కట్టుకున్నాడు. సత్యభామ తన ఎడమ కాలితో చేయరాని పని చేస్తే శ్రీకృష్ణుడు ఏమన్నాడు ? నీ కాలికి ఏమైనా దెబ్బ

తగిలిందా ? నీ కాలు నాకు తగలడం కూడా నాకు గౌరవమే అన్నాడు! పైగా కవి చెప్పిన తీర్పు మరీ సత్య విశేషంగా ఉంది. 'ఫెమినిష్టూ గరిష్ఠుడి' లాగా "నాథుల్ నేరముల్ సేయ పేరలుకం చెందిన యట్టి కాంతలుచిత వ్యాపారముల్ నేర్తురే" అని సత్యభామను సమర్థించడమే కాదు. విషయాన్ని జనరలైజ్ చేశాడు. ఇదేం ఉచిత వ్యాపారం ? పోనీ ఇంత జరిగినా సత్యభామ కోపం తగ్గిందా అంటే లేనేలేదు. అన్ని సమస్యలు చర్చల ద్వారా పరిష్కారం కావాలని ప్రజాస్వామ్యం చెబుతుంది. ఇది నిజమే. మరి కుటుంబ సమస్యల్లో కొన్నిసార్లు ఇది కుదరదు. చర్చల ద్వారా కాదు 'చర్యల' ద్వారానే పరిష్కారమవుతాయి. పెద్ద భార్య రుక్మిణికి పారిజాత పుష్పం ఇచ్చిన చేత్తోనే శ్రీకృష్ణ పరమాత్ముడు చిన్న భార్య సత్యభామకు ఏకంగా పారిజాత వృక్షాన్నే తెచ్చి ఇచ్చాడు. ఇదంతా సత్యభామ తన దర్యాప్తు వలన సాధించిన విజయం. ఆమె దర్యాప్తులో కలహభోజనుడు నారదుడు సీ బీ ఐ లెవెల్లో సహకరించబట్టి సరిపోయింది. 'మీరజాలగలడా? నాయానతి సత్యాపతి వ్రత విధాన మహిమన్' అని సత్యభామ ఢంకా బజాయించి చెప్పగలిగింది.

దేవుడికే ఇన్ని ఇబ్బందులు ఏమిటి ? అని దిగులు పడక్కర్లేదు. మనస్సులో కుతకుత ఉడికిపోనక్కరలేదు. దేవతల కష్టాలు దేవతలవి. సతీమణుల ఆరా అంతర్జాతీయ సమస్య. త్రిమూర్తుల సంగతే చూద్దాం. సరస్వతి బ్రహ్మదేవుడు నోట్లోనే ఎందుకుంది ? బ్రహ్మ గురించి ఆరా తీయడానికే! లక్ష్మీదేవి విష్ణుమూర్తి వక్షస్థలంలోనే ఎందుకు సెటిల్ అయింది? విషయాలు ఆరాతీసి భర్తతో షటిల్ ఆడడానికే! మరి

అర్ధనారీశ్వరుడని పేరు తెచ్చుకున్న శివుడికి అర్ధాంగిగా పార్వతి ఎందుకుంది? పరమశివుణ్ణి 'అడుగడుగునా' గమనించడానికే! దేవుళ్ళకే అలా ఉంటే ఇక మనుషులెంత ? మాట వినని భర్త బాట మీద భార్యకు అనుమానం వస్తే చాలు, అతడి బతుకు బస్టాండో, రైల్వేస్టేషనో, ఎయిర్ పోర్టో ఏదో ఒకటి అవుతుంది. దీనికి ముందు జాగ్రత్తకు మించిన పరిష్కార మార్గం లేదు. అందువల్ల పెళ్లయిన మగాడు పొద్దున సూర్య నమస్కారాలతో పాటు భార్య నమస్కారాలు కూడా చేసుకుంటే సరి. అన్ని వైద్య విధానాలూ దీన్ని సమర్థించవచ్చు. ఎంచక్కా, ఇంటి బయట కాలర్ ఎగరేసుకోవచ్చు. ఇండియాలో కూడా ఇంట్లో డాలర్ ఎగుర వేసుకోవచ్చు. ముందు జాగ్రత్త వల్ల ఇంట్లో సమస్యల నుంచి బయటపడొచ్చునని బాటిల్స్ తెచ్చుకునే వాడు వెర్రివాడు. అది 'బాటిల్ ఫీల్డు' మాత్రమే. దీనికి కొత్తగా వ్యాకరణం తయారు చేసుకోవలసిన అవసరమే లేదు. తెలుగులో ఉన్న వ్యాకరణం చాలు. భర్త అనగా భరించువాడు. భార్య తన మీద ఎన్ని నిందలు వేసినా భరించవలసిందే. భార్య అంటే భరించబడునది. భర్తను భార్య నిందించినా, బంధించినా తప్పు లేదు. భర్త ఏదన్నా బయటికి చెప్పుకుంటే ఆమెకు వచ్చిన నష్టమేమీ లేదు. అతడి పరువే పోతుంది. అది మధ్యలో ఎక్కడా ఆగకుండా గంగలోనే కలిసిపోతుంది. దానికి నోరు మూసుకుని కూర్చోవడం కన్నా ముందు జాగ్రత్త లేనేలేదు. మహా మహా మహాత్ములకే ఈ బెడద తప్పనప్పుడు ఆలోచించి ఏం ప్రయోజనం? బుర్ర హీటెక్కి తలమీద ఉన్న నాలుగు వెంట్రుకలు కూడా కట్టకట్టుకుని ఊడిపోతే ఏం లాభం!

నా జుట్టు ఎవ్వరూ పట్టుకోలేరని ప్రచారం చేసుకోవడానికి కారణం తప్ప ఏం ఫలితం ఉంటుంది? భార్య గయ్యాళి అయి పతిదేవుడి మీద ఆరాలు తీసి తగిన శిక్షలు వేయకపోతే ఈ ప్రపంచానికి తత్త్వవేత్తలు ఎక్కడి నుంచి పుట్టుకొస్తారు ? మహాతత్త్వవేత్త సోక్రటీసు సంగతే తీసుకుందాం. భార్య ఆరాలు తీసి తీసి వేపుకు తినడమో, కాల్చుకు తినడమో చేయకపోతే సోక్రటీస్ అంత గొప్పవాడు అయ్యేవాడా ? అందువల్ల ఏ టెంటులోనయినా తీగలాగడం ఇంపార్టెంటు. భార్య తీగ లాగే కొద్దీ 'ఈ జన్మమిక దుర్లభమురా' అని అనిపించినా మగజీవుడు చేయగలిగిందేమీ లేదు. సంసారం సాగరం అని గుర్తొచ్చి ఊరుకుంటాడు. అలాగని ఏడవలేడు.. ఇలాగని నవ్వలేడు. ఏడవలేక నవ్వుతుంటాడు. తన లాగా ఎవడన్నా కష్టాలు పడుతున్నాడేమో తెలుసుకుని ఊరట పొందుతాడు. ఎదుటివాళ్ల కష్టాలు తెలుసుకోవడం కన్నా ఆనందకరమైనవి మనుషులకు ఏముంటాయి ?

ఆడవాళ్ళు ఆరాలు తీయడానికి ఏమైనా చట్టాలు ఉంటాయా ? చట్టాలు ఉండవు. సెక్షన్లూ ఉండవు. భర్తకు అనుకూలంగా చుట్టాలో, పక్కాలో వచ్చినా చట్టాలు వారికి అనుకూలంగా ఉండవు. భార్యాభర్తల మధ్య జరిగేవి సాధారణ యుద్ధాలు కావు కదా! ఇప్పటివాళ్లలో అనేకమంది మొదటి ప్రపంచ యుద్ధం చూడకపోయామే అనుకుంటారు. కనీసం రెండో ప్రపంచయుద్ధం అయినా చూడలేకపోయామే అనుకుంటారు. వాటిని మరిచిపోయే యుద్ధాలు ఇప్పుడు ఇంటింటా జరుగుతున్నాయి.

ఇవే మూడవ ప్రపంచ యుద్ధాలు. గోడలు ఉండడం వల్ల, తలుపులు మూసుకోవడం వల్ల ఇవి బయటివారికి కనిపించవు. వీటిని గుప్త యుద్ధాలు అని కూడా అనవచ్చు.

"ఏ జంట చరిత్ర చూసినా
ఏమున్నది గర్వ కారణం ?
పెళ్లికి ముందు బేరాలు
పెళ్లయ్యాక ఆరాలు" అని భార్యాభర్తల పంచాయితీల్లో పండిపోయిన ఒక పెద్ద మనిషి స్వానుభవాన్ని కూడా జోడించి చెప్పేశాడు. పెళ్లంటే గూడుపుఠాణీ... తోడు పురాణీ, ఒకరి తప్పుల్ని ఒకరు క్షమించుకుంటేనే భార్యాభర్తలు ఇద్దరికీ మనశ్శాంతి. గృహశాంతి. పనిగట్టుకుని బంధుమిత్రులను, సందు మిత్రులను పిలిచి గ్రహ శాంతులు చేయాల్సిన అవసరం ఉండదు.

అసలు ఆరాలు తీయాల్సిన అవసరం ఆడవాళ్ళకు ఎందుకు వస్తుంది ? పెళ్లయిన కొత్తలో 'నీవే నా దేవతవు. నీవే బంగారానివి' అని వరసబెట్టి రోజుకు ఇరవై నాలుగు గంటలూ పొగిడే మొగుడు ఉన్నట్టుండి కరెంటు స్విచ్ ఆఫ్ చేసినట్లు ఆపేస్తే ఏ ఆడదానికయినా తిక్క రేగుతుందా ? లేదా? రాత్రివేళల్లో ఆలస్యంగా ఇంటి కొస్తుంటే అగ్నికి ఆజ్యం పోసినట్టు ఉండదా ? 'ఏమండీ మునుపటిలాగా నా అందాన్ని మీరు పొగడడం లేదు' అని డైరెక్టుగా అడిగితే "నేను అబద్ధాలు చెప్పడం మానేశాను" అంటే ఆ ఇల్లాలికి మండదా ? దాంతో ఆరాలు తీయడం, వెల్లడయిన ఫలితాల మీద చర్చ జరిగితే ఆలుమగల మధ్య పగలు పెరిగి పగలూ, రాత్రీ పచ్చగడ్డి వేసినా మండదా ? ఆలోచించండి.

ఆరాలు తీయడంతో కల్యాణమే కాదు. లోక కల్యాణమూ ముడిపడి ఉంటుందని ఓ పరిశోధకుడు పురి విప్పి చెప్పాడు. నేరాలు చేసి చట్టాన్నుంచి తప్పించుకుని తిరుగుతున్న ఉగ్రవాదులు, ఇతర సంఘ వ్యతిరేక శక్తులను పట్టుకోవడం ఎలా ? అనే ప్రశ్నకు ఆయన తేలికైన పరిష్కారం చెప్పాడు. వారి భార్యలకు పోలీసు అధికారుల ఉద్యోగాలు ఇచ్చి ఆ కేసులను వారికే అప్పగిస్తే సరి! వారు ఆరాలు తీసి అర్ధరాత్రి అపరాత్రి అయినా సరే పతి దేవుళ్లను పట్టుకొచ్చి, చట్టాలకు లొంగిపోయేట్టు చేస్తారు. వారిలో పరివర్తన వచ్చేట్టు చూస్తారు. ఘరానా నేరగాళ్ల తలలకు వెల కట్టాల్సిన అవసరమే ఉండదు. ఖజానాకు కాసులు మిగులుతాయి. ఆరాలు తీయడం వల్ల జనాలకు ఇన్నిన్ని ప్రయోజనాలు ఉంటున్నాయి. ముందు నిఘా, వెనక నిఘా, కుడిఎడమల నిఘా నిఘా కల్యాణానికి, లోక కల్యాణానికి ఎంతో అవసరం.

ఆరాలూ జిందాబాద్.. నేరాలూ ముర్దాబాద్!

మా'నవ్వు'లూ జిందాబాద్

'హరియను రెండక్షరములు

హరియించును పాపమంత" అన్నారు. ఇది ఒక మతం వారి నమ్మకం. మరి

"నవ్వు అను రెండక్షరములు

హరియించును బాధలన్ని" – ఇది ఒక మత విశ్వాసం కాదు... అన్ని మతాల వారి అఖండ విశ్వాసం! నవ్వు అనేది ఆషామాషీగా లభించేది కాదు. మానవజాతికి లభించిన మహోన్నత వరం. మణిహారం. 'నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును' అని మహాకవి గుర్రం జాషువా అన్నారు. 'నవ్వులు చిత్తవృత్తికిన్ దివ్వెలు' అని కూడా అన్నారు. విలన్ల వికటాట్ట హాసాలు పక్కన బెడితే, సామాన్య మా'నవ్వులు' నవ్వేవి అన్నీ మంచివే! నవ్వలేక ఏడ్చేవాళ్ళు కొందరయితే, ఏడవలేక నవ్వే' వాళ్లు మరికొందరు. 'బూతు' భవిష్యత్ వర్తమానాలు 'స్కాచ్' వడబోసి నవ్వించి మత్తెక్కించే వాళ్లు కొందరుంటారు. ఎటొచ్చీ ఇటువంటి వాళ్లవల్ల ఏమి ప్రయోజనం ? అని జనాల్లో యధాశక్తి చిన్నచూపు చూడడానికి వీల్లేదు. వీళ్లు 'భక్తి'ని పెంపొందిస్తారు. అది ఎలాగంటారా ? వీరి జోకులు విని విష్ణుభక్తులు రామ రామ అంటే, శివభక్తులు శివా శివా అని చెవులు మూసుకుంటారు. ఈ రకంగా అందరిచేత దైవనామ స్మరణం చేయించడం అంత తేలిక కాదు. దేవాలయాల మీద బూతు బొమ్మలు ఎందుకు ? అన్న పుస్తకం రాసిన తాపీ ధర్మారావును తాపీగా కాదు –

తక్షణం తలచుకుంటారు. అది శృంగారం... ఇది హాస్యం. దానితో దీనికి సంబంధం ఏమిటి అని ప్రశ్నించవచ్చు. 'బూతాడక దొరకు నవ్వు పుట్టదు' అని కవి చౌడప్ప అన్నాడు. కానీ బూతు ఆడితే నవ్వు ఎందుకు పుడుతుందో ఎంత జుట్టు పీక్కున్నా అర్థం కాదు. సినిమాల్లో ఒక్కో నటుడు ఇంకో నటుణ్ణి తిడితే నవ్వడం, తంతే అంతకంటే ఎక్కువ నవ్వడం చూస్తుంటాం! ఇటువంటి సీన్లలో సానుభూతి చూపకుండా నవ్వడం ఎంత సబబు? దివ్యాంగుల్ని చూసి కుంటివాడని, గుడ్డివాడని ఈటెల్లాంటి మాటలంటూ నవ్వడం శాడిస్టు హాస్యం! తన మీద తాను జోకులు వేసుకోవచ్చుగానీ, ఇతరులను బాధించే జోకులు వేయకూడదు. జోకుకు కారణమైన వాడు కూడా నవ్వి ఆనందిస్తేనే అది అసలు సిసలయిన జోకు. కుర్రవాళ్లు, ముసలివాళ్లను ఎగతాళి చేయడం కూడా సంస్కార రాహిత్యానికి ఉదాహరణ. కులం, మతం, ఆ ప్రాంతం ఆధారంగా కించపరిచేవి కూడా నీచమైన జోకులే! దేవుళ్ల మీద జోకులు వేయడం కూడా ఇదే బాపతు.

హాస్యం నవ్వించాలి గానీ నవ్వుల పాలు కాకూడదు. హాస్యానికి ప్రతిస్పందన ఎదుటి మనిషిలో కొట్టొచ్చినట్టు కనిపించాలి. ఇది వెంటనే కనిపించనవసరం లేదు. కాస్త ఆలస్యంగా నవ్వినా ఫరవాలేదు. ఆ మధ్య ఒకాయన నా దగ్గర కొచ్చి అహ్హహ్హా అని నవ్వాడు. ఎందుకయ్యా అలా నవ్వుతున్నావు ? అని అడిగాను. నీ జోకు బాగుంది అన్నాడు. నేను నిన్న మధ్యాహ్నం కదా జోకు వేసింది. ఇప్పుడు నవ్వుతావేమిటి? అన్నాను. దీనికి ఆ పెద్దమనిషి నీవు జోకు వేసింది నిన్ననే కానీ నాకు అర్థం అయింది ఇప్పుడే కదా అనేశాడు. ఆలస్యం అయితేనేమి నవ్వాడు

కదా అని నేను సంతోషించాను. ఇక్కడ ఆలస్యం అమృతం విషం అనేది పనికి రాకపోవచ్చు గానీ నిదానం ప్రధానం అనేది నిస్సందేహంగా పనికొస్తుంది. హాస్యం అందరికీ అర్థం కాదు. ఎవరెవరి మానసిక స్థాయిని బట్టి వారికి అర్థమవుతుంది. 'జోకేశ్వరోపాసన' చేసేవాడు దీనిని దృష్టిలో పెట్టుకోవచ్చు.

హాస్యం వల్ల వినేవాడి ఆరోగ్యం బాగుపడాలి. వెనకటికి 'సంతోషం సగం బలం' అన్నారు. టెన్షన్లు పెరిగిపోయిన ఈ రోజుల్లో సంతోషం సంపూర్ణబలం అని నమ్మక తప్పదు.

నవ్వు ఎదుటివాడి మనస్తత్వాన్ని రంచనుగా అంచనా వేయడానికి చక్కగా ఉపయోగపడుతుంది. పసిపిల్లల నవ్వు చూసి చలించని వాడు పాముకన్నా భయంకరుడు అని షేక్స్పియర్ అన్నాడు. ఆయన అన్నది ఇంగ్లీషులో కదా నీకెలా తెలిసింది? అని అడగకూడదు. ఇంగ్లీష్ తెలిసి అర్థమయిన గురువుగారు నాకు చెప్పారు. నేను 'ఏకభాషావ్రతుణ్ణి'! తెలుగు తప్ప ఇంకో భాషలో మాట్లాడలేను. రాయలేను. అందువల్ల తెలుగు తల్లికి నేను ఎంతయినా సేవ చేయగలను.

హాస్యం ఎదుటివాణ్ణి నవ్వించేటట్టు ఉండాలిగానీ ఎదుటివాడు నవ్వుకునేట్టు ఉండకూడదు. 'మానవసేవే మాధవసేవ' అంటారు. నిజానికి చేవగల హాస్యం చేసే సేవ అంతా ఇంతా కాదు. వింతా కాదు. మా నవ్వు సేవ మాధవ సేవ అనుకుని ఆనందించాలి.

హాస్యాన్ని ఆనందించడానికి కూడా అదృష్టం ఉండాలి. అది లేకపోతే కళాకారుడికి కష్టం! సుప్రసిద్ధ హాస్య నటుడు బ్రహ్మానందంను ఓ పెద్దమనిషి పిలిచి అద్భుతమైన సత్కారం చేశాట్ట! ఆ తర్వాత బ్రహ్మానందం మాట్లాడుతుంటే జనం విరగబడి నవ్వారట! దాంతో

నిర్వాహకుడికి తెగ కోపం వచ్చింది. తీరని అవమానంగా ఫీలయ్యాట్ట! దాంతో "మీకు బుద్ధి లేదా ? నేను కష్టపడి ఒక పెద్దమనిషిని పిల్చుకొస్తే మీరు నవ్వుతారేమిటి ? ఆపేయండి" అని నవ్వే వాళ్లను కసురుకున్నాట్ట.

హాస్యానికి కాంక్షలు ఉండవచ్చు కానీ ఆంక్షలు ఉండకూడదు. ఒక్కో సభలో శుభ్రంగా మొదటి వరసలో కూడా ఏడుపు మొగం వేసుకుని కూర్చునేవాళ్లు తగులుతుంటారు. ఏడ్చే దాని మొగుడొస్తే నా మొగుడొస్తాడు అన్నట్టు కొంతమంది కనిపిస్తుంటే నవరసాలకన్నా నీరసం గొప్పది అనిపిస్తుంది. ఏ రసాన్ని అనుభవించినా చివరికి వచ్చేది నీరసమేగా!

నవ్వంటే ఏమిటనుకున్నారు ? మనిషికి ఆరోగ్యానికి అనుసంధానమైనది నవ్వు. "నవ్వడం ఒక భోగం. నవ్వించడం ఒక యోగం. నవ్వలేక పోవడం ఒక రోగం" అన్నారు జంధ్యాల. రకరకాల వ్యాధులతో సతమతమవుతున్న ఈ ప్రపంచానికి Laughter is the best medicine అని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అందుకే నేనన్నాను బి.పి లేనివాడు బిర్లా, షుగర్ లేనివాడు టాటా! అని, ఉచిత వైద్యమైన నవ్వును ఆశ్రయిస్తే బీపీ, షుగర్‌లు తగ్గి ఆరోగ్యవంతుడవుతాడు. ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయడమే మంచిదనుకుంటే చేయగలిగిందేమీలేదు.

ఎవరికి అయినా ఏదైనా బహుమతి ఇవ్వగలం కానీ ఆరోగ్యాన్ని బహుమతిగా ఇవ్వలేమని దివంగత పారిశ్రామికవేత్త ధీరూబాయ్ అంబానీ అనేవారు. అందువల్ల ఎవరి ఆరోగ్యాన్ని వారు కాపాడుకోవలసిందే. రోగాల్ని బదిలీ చేసే అవకాశమే ఉండి ఉంటే, డబ్బున్న వాళ్ళు ఆ జబ్బులను తమ దగ్గర పనిచేసే వారికి నయానో, భయానో బదిలీ చేసేవారు. కానీ దేవుడు ఆ అవకాశం ఇవ్వలేదు. ఇది బడుగు జనం పట్ల ఒకరకమైన దేవుడి దయ.

జీవులే కాదు దేవుళ్లు సైతం ఆనందం కోసం తాపత్రయపడ్డ వాళ్లే. 'ఆనందోబ్రహ్మ' అన్నారు కానీ దీనితోపాటు ఆనందో విష్ణు, ఆనందో మహేశ్వరః, ఆనంద సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ ఆనందవే నమః అనక తప్పదు.

నవ్వు పుట్టు పూర్వోత్తరాలే వేరు. నవ్వు మనిషి కన్నా ముందు పుట్టింది. ఇది శాస్త్రీయ సత్యం. అనుమానం ఉన్నవాళ్లు డార్విన్‌ను అడిగి సందేహ నివృత్తి చేసుకోవచ్చు. అయితే ఆయన చెప్పింది మానవ పరిణామ సిద్ధాంతం. ఇది సరికాదు. అది వానర పరిణామ సిద్ధాంతం. కోతి ఎన్ని విధాలుగా పరిణామం చెందింది అనేది అందులోని సారాంశం. మరి కోతి కిచకిచలాడుతుంది. నవ్విస్తుంది. అంటే మనిషికన్నా ముందు నవ్వు ఉందనేగా. ఆంజనేయ స్వామి మీద ఒట్టు. కాదనేవాళ్ల సంగతి ఆయనే చూసుకుంటాడు. కోతి నుంచి పుట్టడం అప్పటి సంగతి. మనిషి నుంచి కోతి పుట్టడం ఇప్పటి సంగతి. కోతి టు కోతి వయా మనిషి. అప్పటి కోతులకు మనిషి బుద్ధులు వస్తే ఇప్పటి మనుషులకు కోతి బుద్ధులు వస్తున్నాయి. అన్నీ వేదాల్లోనే ఉన్నాయష అన్నట్టే అన్నీ మన తాతలే చెప్పారు. బ్రహ్మచారీ శతమర్కటః అన్నారు. ఒక్క బ్రహ్మచారి వంద కోతులతో సమానమట! పెళ్లయిన తర్వాత అయినా కోతి బుద్ధులు వదులుతాయా? అంటే అనుమానమే. వానరం ఉత్పత్తి సంగతేమయినా, పండితులు చెప్పిన వ్యుత్పత్తి ప్రకారం వానరం అంటే 'నరఃవా' మనిషా అనిపించేదట. ఇది డార్విన్ పుట్టక ముందే పుట్టింది. రాజీపడితే మనిషి తోక లేని కోతి.

పుట్టపర్తిలోని సత్యసాయి విద్యాలయానికి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఒక బొమ్మ బహూకరించారు. అది తోకలేని కోతి. దానిని నేను చూశాను. మనిషి స్వభావాన్ని చిత్రించే బొమ్మ అది. సుందర పారాయణం చేసినా హాస్య సౌందర్యం సాక్షాత్కరిస్తుంది. 'హనుమాన్ సుందరః' అన్నారు.

‘కోతి బావకు పెళ్లంటా’ అనే పాట కూడా ఉంది. ప్రపంచం సుందరమయమయితే ఆ ఆనందమే వేరు!

నవే దేస్ అన్నీ ‘నవ్వే’దేస్ కావాలి. నవ్యాంధ్ర అంటున్నాం. అది ‘నవ్వు ఆంధ్రా’ అయితే దివ్యాంధ్ర అవుతుంది. ‘నవ్వు’ నవోన్మేషమవుతుంది. ప్రతి రోజూ పండగ అవుతుంది. నవరాత్రులు నవ్వు రాత్రులు అవుతాయి.

ముందు నవ్వు వెనక నవ్వు

కుడిఎడమల నవ్వు నవ్వు అయితే లేని దేముంటుంది ? ‘హాస్యో రక్షతి రక్షితః’ అనాలి ఈ రోజుల్లో. హాస్యాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది. ఇది లోక కల్యాణం సంగతి.

కల్యాణానికి కూడా మూలం నవ్వే. లవ్వుకు మూలమూ నవ్వే. ‘ఒక్క నవ్వే చాలు వద్దులే వరహాలు’ అన్న పాటా ఉంది. అమ్మాయే నవ్వితే అబ్బాయిలు ధామ్మని ప్రేమలో పడిపోతారు. ఒక్కోసారి పొరపాట్లు కూడా జరుగుతాయి. ఒరేయ్ నిన్ను వలచింది సుశీలా ? సుబ్బలక్ష్మా! అని ఒకాయన విచారిస్తే ‘ఇద్దరు కలిసి తోలు వలిచేశారురా’ అని ఒకాయన విచారిస్తూ చెప్పాడట! నవ్వు నాలుగందాల చేటు అంటారు కదా ఆ రూటు కూడా ఒకసారి చూసుకోవాలి. ఎందుకయినా మంచిది!

నవ్వు వ్యాపార విజయ రహస్యం కూడా. షాపుల్లో ఏడుపు మొహం వేసుకుని కూర్చునేవాడి దగ్గరికి ఎవ్వడూ రాడు. అయ్యా! ఆరోగ్యం దెబ్బతినడం మొదలుపెడితే చేయగలిగిందేమీ లేదు. ‘క్షవరం’ మొదలయితే సగంలో ఆగదు. అందువల్ల ముందు జాగ్రత్తగా నవ్వడం మంచిది. శుభం భూయాత్.

శిష్యా కొంప పీకరా!!

'**గు**రువుగా చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రి పరిస్థితి చిత్రాతిచిత్రం. ఆయన కన్నా అదృష్టవంతుడు లేడు. దురదృష్టవంతుడూ లేడు. తెలుగువారి సొంతమైన అవధాన కళకు అద్భుతమైన జనాకర్షణ కలిగించిన జంట అవధానులు అయిన తిరుపతి వేంకటకవుల్లో ఒకరు ఆయన. విశేషమేమిటంటే చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రి శిష్యుడు కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. ఆయన తమ గురువు గారి గురించి ఇలా చెప్పారు.

అల నన్నయ్యకు లేదు తిక్కనకు లేదా భోగమస్మాదృశుం
డలఘు స్వాదు రసావతార ధిషణాహంకార సంభార దో
హల బ్రాహ్మీమయమూర్తి శిష్యుడయినాడన్నట్టి దావ్యోమ పే
శల చాంద్రీ మృదుకీర్తి చెళ్ళపిళ వంశస్వామి కున్నట్లుగన్

తన వంటి శిష్యుడు ఉండే భాగ్యం నాడు నన్నయ్యకు, తిక్కనకు కలగలేదు. చెళ్లపిళ్లవారికి మాత్రమే దక్కింది అన్నారు. తన గౌరవాన్ని పెంచుకుంటూనే గురువుగారి గౌరవాన్ని ఆకాశం ఎత్తుకు పెంచారు. 'లేడురా ఇటువంటి శిష్యుడింకెందు' అనిపించారు. భేష్ భేష్! ఇదో కోణం. రెండో కోణంతోనే సమస్య!

చెళ్లపిళ్ల వెంకటశాస్త్రికి ఓలేటి వెంకటరామశాస్త్రి అనే శిష్యుడు ఉండేవారు. ఆయనా ప్రసిద్ధుడే. ఎటొచ్చీ ఆయన గురువుగారిని పట్టుకుని నేను నీ శిష్యుణ్ణే కాదు పొమ్మన్నారు. చెళ్లపిళ్ల వారికి మండింది. దాంతో ఓలేటి వారిని తన శిష్యుడని నిరూపించడానికి ప్రయత్నించారు. తిరుపతి

వెంకట కవులంటే అద్యతనాంధ్ర కవిత్వ ప్రపంచ నిర్మాతలు. అలాంటి వారికి కోపమొచ్చినా, తాపమొచ్చినా, ఇంకేమి వచ్చినా మొదట నోటి వెంట వచ్చేది పద్యాలేగా! చెళ్లపిళ్ల వారి వివాదం సంగతేమైనా పద్యం సాహిత్య ప్రియులందరికీ మంచి వినోదమైంది.

ఇంజరంబొక సాక్షి - యేనాము తాసాక్షి
పల్లెపాలెంబు తా నెల్లసాక్షి
ఇపుడు నీవున్నట్టి - యీ పిఠాపురి సాక్షి
ఏలూరు సాక్షి నీ ఇల్లు సాక్షి
వల్లూరు నృపతి శ్రీ - భాష్యకారులు సాక్షి
నూజివీడ్రామచంద్రుండు సాక్షి
మంజువాణీ ప్రెస్సు - మానేజరొక సాక్షి
శంకరుండాతని సాని సాక్షి
మధున పంతుల సూరయ బుధుడు సాక్షి
యయ్యనఘు, నన్న సాక్షి సుబ్బయ్యగారు
సాక్షులున్నారు పద్యంబు చాలదింక
వేంకటేశ్వరు శిష్యుడవే, నిజంబు

చిత్రమేమిటంటే ఈ వివాదం వాళ్లిద్దరికే పరిమితం కాలేదు. అటూ, ఇటూ వకాల్తా పుచ్చుకున్న ఉద్దండులూ ఉన్నారు. 'వెంకట శాస్త్రి గారిని గురువు కాదంటావేమిటయ్యా! ఆయనే నీకు గురువు' అంటూ చెళ్లపిళ్లవారి సోదర అవధాని తిరుపతి శాస్త్రి... వేంకటరామశాస్త్రిని ఉద్దేశించి రెండు పద్యాస్త్రాలు సంధించారు. "వ్యాకరణంబు చెప్పె, నదియంటకపోయిన పోవుగాక, నీ/ కీ కవి నామమయ్యనఘు డేకద పెట్టిన, దంతబోక, తా/ నే కడకేగె నిన్నుగొని యేచనె నచ్చటి కట్టివాని, సు/ శ్లోకు సభాస్థలిన్విడచి చోరుగతి

న్మెలగంగనేమొకో?". "వేంకటేశ్వరు పాదంబు వీడి, పిదప/ నెవని సేవించితివి చెప్పుమింతయేల?/ యే విషయమీవు సాధించినావొ పిదప/ వ్రాయుమా వేంకటేశ్వరు పదములాన!" అని హితవు చెప్పారు.

అంత మాత్రాన శిష్యుడి మనసు మారిందా అంటే మారలేదే! 'పాఠం చెప్పేవాడు గురువు... గుణపాఠం చెప్పేవాడు శిష్యుడు' అని శిష్య బాధితుడైన ఓ గురువు ఎప్పుడో చెప్పాడు. చెళ్లపిళ్లవారిని తూలనాడుతూ ఓలేటి వెంకట్రామశాస్త్రి సోదర కవి అయిన వేదుల రామకృష్ణ శాస్త్రి ఇంకో పద్యం చెప్పారు. "ఎట్టొ చదివితి మూన్నాళ్ల పట్టపవలు/పట్టుమని రెండు ముక్కలు పలుకకున్న/తిరుగడికనెన్ని సెప్పిన గురుడననుచు/తగులుకున్నాడు నిన్ను సైతానులాగు" అనేశారు. ఈ పద్యంలో చెళ్లపిళ్లవారి గురించి నీచంగా రాసినా ఓలేటి వెంకట్రామశాస్త్రి చెళ్లపిళ్ల వారి శిష్యుడని ఆయన మిత్రుడే చెప్పక తప్పలేదు.

చిత్రమేమిటంటే చెళ్లపిళ్ల వెంకటశాస్త్రికి తన శిష్యులతోనే కాదు గురువుతోనూ పేచీలు వచ్చాయి. చెళ్లపిళ్లవారు తమ గురువుగారి మీద కోపంతో తక్కువ అన్నారా? 'గురుడైనన్ హరుడైననేమి' అని పద్యం చెప్పారు. మరి ఆయన శిష్యుడు తన గురువుగారి పాండిత్యాన్నే వేలెత్తి చూపాడు. 'శ్రుత పాండిత్యము దక్కలేని గురుడు' అని చెళ్లపిళ్ల వారి పాండిత్యాన్ని గురించి ఎకసెక్కెమాడాడు. చెళ్లపిళ్ల విని నేర్చుకున్నదే, చదువుకున్నది అంత లేదని శిష్యుడు (ముక్కు) పిండితార్థం, పండితార్థం చెప్పాడు.

ఎవడు శిష్యుడు? ఎవడు కాడు? ఓ మహాత్మా ఓ మహర్షీ!

అచ్చు వేసి చూడు

‘ఇల్లు కట్టి చూడు... పెళ్లిచేసి చూడు’ అన్న వేవో పేద్ద ఘనకార్యాలుగా తెలుగువాడు ఎప్పుడో డప్పువేశాడు. ఈ ప్రచారానికి ఇప్పుడు తుప్పు పట్టింది. ‘అచ్చువేసి చూడు’ అన్నది తాజా సవాల్. పుస్తకం రాసినవాడిని గ్రంథ రచయిత అంటారు. మరి అడ్డగోలు పనుల్ని చేసిన వాణ్ణి గ్రంథసాంగుడని ఎందుకు అంటారో **ఏ గ్రంథ రచయితా ఎందుకు రాయడు** ? పైగా ఆయనదో గ్రంథముందంటారు. నిజానికి పుస్తకమంటే మస్తకమే. పుస్తకమంటే హస్తభూషణం కూడా. ఎవడి పుస్తకమో మన చేతిలో ఉంటే అది హస్త భూషణమెలా అవుతుంది? అందువల్ల మన పుస్తకమే మన చేతిలో ఉండాలి. అందువల్ల అచ్చోసి దేశంమీదికి వదిలితే సరి! ఇక్కడ గిట్టని వాళ్లు ఆంబోతులన్న మాట వాడినా లెక్క పెట్టాల్సిన అవసరం లేదు. మేము కవి వృషభులమయ్యా అని బోరవిరుచుకు తిరగవచ్చు. పుస్తకమే అచ్చేస్తే ఎంత పేరు వస్తుందో! **ఎంత పెద్ద ఫోటో వస్తుందో** అనుభవైకవేద్యమే తప్ప ఒకరు చెప్పనవసరమే లేదు. పుస్తకంలోని ప్రతి పేజీలో పైనా కిందా కూడా తాటికాయంత అక్షరాల్లో పేరు వేసుకోవచ్చు. చివరి పేజీలోనే కాదు కవర్ పేజీలో కూడా కలర్ ఫోటో వేసుకోవచ్చు. పుస్తకం మార్కెట్లో రాకముందే కాబట్టి నవ్వు ముఖం ఉన్నా ఇబ్బంది లేదు. నా పుస్తకం ఎలా ఉంది అని అడిగితే నీ మొహంలా ఉందని ఎవరన్నా చెబితే సంతోషించవచ్చు. జిడ్డు మొహం అయితే సబ్బుతో కడుక్కుని

పౌడర్ రాసుకోవచ్చు. సత్తైకాలంలో కాబట్టి దేవుళ్ళు కలలో కొచ్చి ఫలానా పుస్తకం రాయవయ్యా అని తమ భక్తుల్ని అడిగే వాళ్ళు. అడిగీ అడిగీ దేవుళ్లకు నోరు నొప్పి పుట్టిపోయింది. దేవుడితోడు ఇప్పుడు. ఎవరికి ప్రేరణ వాళ్లే. పుస్తకం అచ్చువేస్తే ఎవరు చదువుతారులే అని అనుకోకూడదు. మన పుస్తకాన్ని ఒకడు చదవడమేమిటి ? చదివినా వాడికేం అర్థమవుతుంది ? వాడు వ్యాఖ్యానించడమేమిటి ? ఆ ఖర్మ మనకేం పట్టింది ? మన పుస్తకం మనమే చదువుకుంటే ప్రాణం హాయిగా ఉంటుంది. ఎవరూ చదవకపోవడం ఎంత అహింస! ఎంత ఆత్మానందం!

'బుక్కులో బుక్కునై
పేజీలో పేజీనై
ఈ బుక్కు దాగిపోనా ?
ఎటులైన ఒక లుక్కు వేసుకోనా ?'

అని పాడుకోవచ్చు. దేవులపల్లి కృష్ణపక్షం రాస్తే మనం తృష్ణపక్షం రాసుకోవచ్చు.

పుస్తకాలు అమ్ముకుంటే బాగానే ఉంటుందిగానీ కొనేవాళ్ళను నమ్మడానికి వీల్లేదు. వాళ్లు రకరకాలుగా ఉంటారు. వాళ్లతో రకరకాల ప్రమాదాలు ఉంటాయి. ఇతరుల అనుభవాల సంగతి నాకు ఎందుకు? నా అనుభవమే ఇక్కడ చెబుతున్నాను. కొన్ని దశాబ్దాల కిందట నేనో కవితా సంపుటి అచ్చు వేశాను. శతాబ్దాల కిందట అచ్చు వేశానని చెబితే మాత్రం మీరు నమ్ముతారా ? నమ్మరు కాబట్టి ఆ మాట మీకు చెప్పను. నమ్మే మాటలే చెప్తాను. సరేనా ! ఈ పుస్తకం ఎలా అచ్చు వేశావయ్యా అని మీరు అడుగుతున్నారు కదూ! నా గడ్డి నేను తిన్నానయ్యా!

ఇందులో చింతామణి నాటకం నాకు ఇన్‌స్పిరేషన్. తాతలనాటి ఆస్తులన్నీ తెగనమ్మి పుస్తకం కళ్లచూసుకున్నాను. రక్తం కళ్ల చూసినంత పనయింది. అయితేనేం నాకు ఎంత పేరు వచ్చిందో చెబితే మీరూ అదే పని చేస్తారు. అప్పుడు మిమ్మల్ని చూసి నేను అసూయపడాల్సి వస్తుంది. అయినా చెబుతాను. నేను పుస్తకం అచ్చువేసి అది మార్కెట్లో వచ్చిన రోజే మొత్తం కాపీలన్నీ అమ్ముడుపోయాయి. అందరూ బిత్తరపోయారు. నాకు అభినందన సభ పెట్టారు. అందుకూ నేనే డబ్బు ఖర్చు పెట్టాను. ఇతరులు మెచ్చి మేకతోలు కప్పే రోజులా ఇవి! పేరు ఊరికే వస్తుందా? సన్మాన సభలో ముఖ్యఅతిథిగా వచ్చిన ఒక మహానుభావుడు నా గురించి మాట్లాడడం మొదలుపెట్టాడు. ఈయన పుస్తకం మార్కెట్లో విడుదలయిన రోజే అన్ని కాపీలూ అమ్ముడుపోయాయి. ఇందులో ప్రతి పేజీ తీపి రుచులను పంచిందని టముకు వేశాడు. ఉబ్బితబ్బిబ్బయిపోయాను. నా విజయరహస్యం అందరికీ చెప్పమని సదరు ముఖ్య అతిథిని రహస్యంగా అడిగాను. “ఈ పుస్తకం అచ్చయి మార్కెట్‌లోకి రాగానే, అన్ని పుస్తకాలను మిఠాయి షాపుల వాళ్లు ఎగబడి కొన్నారు. అన్నీ ఆ రోజే జనంలోకి వెళ్లిపోయాయి. అందువల్ల పుస్తకంలోని ప్రతి పేజీ తీపి రుచులను పంచింది” అని ఆయన నిండు సభలో చెప్పారు. ఈ రోజుల్లో ఎంతోమంది కవులు ఉచిత పుస్తక ప్రదాన కార్యక్రమం ప్రవేశపెట్టారు. ఇది సాహిత్య సంక్షేమ పథకం. అయితే ఇందులో కొన్ని ఇబ్బందులున్నాయి. మనం ఉచితంగా పుస్తకాలు ఇవ్వడం ఎందుకు ? అంతకుముందు ముక్కూమొహం తెలియని వాడిచేత కూడా ‘తద్దినాలు’ పెట్టించుకోవడమెందుకో. తద్దినం అంటే శ్రాద్ధం. అంటే శ్రద్ధతో పెట్టేది.

మంచి చెడ్డలు చెప్పడం అంటే శ్రద్ధతో చేసేదే కదా! వాడు మంచిగా అన్నా మనకు మంచిగా అర్థం కాకపోతే సమస్య. ఎరక్కపోయి నా పుస్తకాన్ని ఒకాయనకు ఉచితంగా ఇచ్చాను. పుస్తకాన్ని అంది పుచ్చుకున్నాయన 'కాపీలు' ఉన్నాయా అని అడిగాడు. నాకు చెడ్డ కోపం వచ్చింది. ఇచ్చిన పుస్తకాన్ని వెంటనే వెనక్కు లాగేసుకున్నాను. నా పుస్తకంలో కాపీలు ఉన్నాయని ఎవడన్నాడు అని నిష్ఠూరమాడాను. పాపం ఆయన మంచాయనే. కాపీ అంటే ప్రతి. చూచికాపీ అని అపార్థం చేసుకోకు' అని భాష్యం చెప్పాడు. ఎవరైనా పుస్తకం తీసుకున్న వ్యక్తి దానిని చదివి ఎప్పటికీ ఇంట్లోనే పెట్టుకుంటాడన్న గ్యారంటీ లేదు" అన్ని దానాల్లోకి పుస్తకదానం గొప్పది. పుస్తకాన్ని మళ్లీ ఇస్తాడనే నమ్మకంతో ఇతరులకు ఇస్తే ఆ పుస్తకం తిరిగిరాక దానంగానే మారుతుంది. 'పరహస్తం గతం గతః' అని మన పెద్దలు చెప్పిన జాబితాలో పుస్తకం ఒక్కటే కచ్చితం. అందుకని అభినందనలు అని రాసి ఇచ్చి ఆశవదులుకోవడం వేయిరెట్లు మంచిది. కొన్నేళ్ల కిందట ఆరుద్ర కవి తన మిత్రుడొకరికి తనే పుస్తకాన్ని బహూకరించారు. అందులో గౌరవప్రదంగా ఆయన పేరురాసి, అభినందనలతో అని కూడా రాశారు. కొన్నాళ్ళ తర్వాత అదే పుస్తకం ఆరుద్రకు సెకండ్ హ్యాండ్ మార్కెట్‌లో దర్శనమిచ్చింది. ఆ పుస్తకాన్ని ఆయన కొని అంతకు ముందు తాను ఆ పుస్తకాన్ని ఇచ్చిన పెద్ద మనిషికి తిరిగి బహూకరించారు. అందులో ఆ మిత్రుడి పేరు రాసి పునరభినందనలతో అని రాసిచ్చాడు. ఆ మిత్రుడు కూడా బాధపడి ఉండడు. సంతోషించే ఉంటాడు. ఆ పుస్తకాన్ని మళ్లీ అమ్ముకోవచ్చు. ఈ ప్రపంచంలో నమ్మి చెడ్డవాడు ఉండవచ్చుకానీ అమ్మి చెడ్డవాడు లేడు. అమ్మితే పెన్నిధులొస్తాయి. ఒక్కోసారి పేరులోనే పెన్నిధులుంటాయి.

ఒక రచయితగారు తన పుస్తకానికి అర్ధాంగి అనే పేరు పెట్టారు. ఆయన అర్ధాంగిగారు కూడా సంతోషించారు. రచయితకు అంతకన్నా గౌరవమేముంది ? జ్ఞానపీఠం అవార్డులు వచ్చినా, కేంద్రసాహిత్య అకాడెమి అవార్డులు వచ్చినా దీనిముందు దిగదుడుపే! అయితే ఆ తర్వాత ఆ పేరే కొంప ముంచింది. పుస్తకం విడుదలయిన వారం రోజుల్లోనే కుప్పతెప్పలుగా లేఖలు వచ్చాయి. 'మీ 'అర్ధాంగి' సర్వాంగసుందరంగా ఉంది, మాకు తెగనచ్చేసింది' అన్నది అనేక ఉత్తరాల సారాంశం. మరి కొంతకాలం తర్వాత 'మీరు చెప్పినట్టు మీ అర్ధాంగికోసం 100 రూపాయలు మనియార్డర్ చేశాం. ఇంకా చేరలేదు. తక్షణం దిగువ ఇచ్చిన అడ్రసుకు పంపగలరు. మీ అర్ధాంగి కోసం వేయికళ్లతో ఎదురు చూస్తుంటాం" అని మరికొన్ని ఉత్తరాలు వచ్చాయి. రచయిత తల పట్టుకోవాల్సి వచ్చింది. కాబట్టి పుస్తకాలకు పేర్లు పెట్టే ముందు రచయితలు శీర్షికాసనాలు వేస్తే బెటరు. తలరాత బాగుంటుంది. "ఎంచి చూడగ మనుజులందున రెండె రకములు" అన్న గురజాడ రాతలు ఎన్ని రకాలో చెప్పలేదు. ఆ పని శ్రీశ్రీ చేశాడు. సర్దుబాటు చేశాడు. "మంచి రచనలన్ కూర్చే శక్తి నశిస్తే, చేర్చదగునొకంత చెత్త సిరిసిరి మువ్వా" అనేశాడు.

పుస్తకమంటూ అచ్చువేస్తే నాలుగు రాళ్ళు వెనకేసుకోవచ్చు. నిజంగానా అని దిగులు పడక్కర్లేదు ఇది గ్యారంటీ. తెలుగులో ఇది మరింత గ్యారంటీ. పుస్తకమంటూ రాశాక ఎవరో ఒకరు రాళ్లేయక పోతారా? అవన్నీ తెచ్చుకొని ఒక పెద్ద బిల్డింగే కట్టుకోవచ్చు. రాసిన పుస్తకం భువన విజయానికి ఉపయోగపడకపోయినా భవన విజయానికి ఉపయోగపడుతుంది. ఈ భవనం కోసం రాళ్లెత్తిన కూలీలెవ్వరు ? అంటూ మహాకవి శ్రీశ్రీలాగా అమాయకంగా అందరినీ అడగాల్సిన

అవసరమే ఉండదు. సొంత డబ్బుతో పుస్తకాలు అచ్చేసి వాటిని నలుగురికీ ఉచితంగా పంచే వారికన్నా త్యాగధనులు ఎవరుంటారు ? సొంత లాభం కొంతమానుకొమ్మని గురజాడ గారు కూడా చెప్పారు. అయితే పుస్తకం అచ్చుకు ముందే సొమ్ము చేసుకునే మార్గాలు కూడా ఉన్నాయి. ఇందుకు అంకితం ఒక మార్గం. ఎటొచ్చీ దానికి ప్రజాసంబంధాలో, వ్యాపార సంబంధాలో అవసరం. కృతి అంటే కావ్యం. రాసిన వాడు కృతికర్త. అంటే తండ్రి. అంకితం పుచ్చుకునే వాడు కృతిభర్త. అంటే పుస్తకం రాసిన వాడికి పుచ్చుకునే వాడు అల్లుడు. మామగారు అల్లుడికి కట్నం ఇవ్వడం కాకుండా ఇక్కడ అల్లుడే మామగారికి కట్నం ఇచ్చుకుంటాడు. వీటితో పాటు వస్తురూపంలో స్వర్ణకంకణాలు, శాలువ, జ్ఞాపికలు రావచ్చు. కవి మార్తాండ, కవి చండ ప్రచండ లాంటి బిరుదులూ వరించవచ్చు. అంతా ఇచ్చేవాడి ఓపిక, పుచ్చుకునే వాడి అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది. అయితే అంకితం పుచ్చుకునే వాడికి కొన్ని అర్హతలు ఉండాలి. అవేమిటంటే అతగాడికి అక్షరమ్ముక్క రాకుండా ఉండాలి. చేతినిండా డబ్బు ఉండాలి. కీర్తికండూతి అనే వ్యాధి విశేషం ఉండాలి. అతగాడు బంధువో, పార్టీవాడో అయితే మరీ ప్లస్ పాయింట్. అతగాడి డబ్బుతో రచయిత తన పుస్తకాలు అచ్చేసుకోవడం, పుస్తకాలు అమ్ముడు పోతే గీతే ఆ డబ్బు జేబులో వేసుకోవడం. పెట్టుబడి లేని వ్యాపారం.

పుస్తకం అందరికీ నచ్చేస్తేనే అచ్చేయాలన్న అత్యాశ పనికి రాదు. రాసిన వాడికి నచ్చితే చాలు. కాకిపిల్ల కాకికి కూడా ముద్దు రాకపోతే దాని బతుకెందుకు ? అక్షరమంటే నాశనం లేనిది. మంచి పుస్తకమయినా, చెడ్డ పుస్తకమయినా అంతే. చెదలు పడుతుంది కదా! అని వదలగూడదు. ఎవరు ఏమి రాసినా అది ప్రబంధమే.

ప్రబంధమనగా ప్రకృష్టమైన బంధం అని అర్థం. ప్రకృష్టమైన బంధం అంటే మంచి బైండింగ్! 'నా నృషిః కురుతే కావ్యం' అన్నారు. రుషికాని వాడు కావ్యం రాయలేడని అర్థం. దీని సంగతేమో కాని మహర్షి కాకపోతే కావ్యంగానీ, నవల కానీ అచ్చువేసుకోలేరు. ఏ పుస్తకంలోదో ముక్క ఒక్కటి వచ్చి మన పుస్తకంలో వాలినా అసలు వాడు వాలిలా వచ్చి వాలీబాల్ ఆడతాడు. అప్పుడు జడ్ సెక్యూరిటీ కూడా చాలదు. ఎ టూ జడ్ సెక్యూరిటీ అవసరమవుతాయి. అచ్చు వేయడానికి సిద్ధపడ్డప్పుడు ఏది వచ్చి గుచ్చుకున్నా లెక్కపెట్టకూడదు.

ఆలోచిస్తే అచ్చు అనే రెండక్షరాలు అత్యంత ఆనందాన్ని కలిగిస్తాయి. 'అందమంతా అచ్చులోనే ఉన్నది' అని హాయిగా పాడుకోవచ్చు. కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు కుంతీకుమారిని వర్ణిస్తూ "అచ్చు గుద్దినట్లున్నవి, రూపురేఖలు" అంటారు. అచ్చువేసే వాళ్ళు స్థూలంగా రెండు రకాలు. వివిధ పత్రికల్లో తమ రచనలు అచ్చు వేయించుకుని వాటన్నింటినీ కలిపి అచ్చుకునే వారు ఒక బాపతు. ఏ పత్రికా అచ్చు వేయకపోవడం వల్ల ఆ రచనలన్నింటిని పుస్తకంగానే వేసే వాళ్లు ఇంకొక బాపతు.

పుస్తకం అచ్చువేశాక ఎవరైనా లవ్వులో పడవచ్చు. కెవ్వున ఏడవవచ్చు. ఏదయినా జరగవచ్చు. తొణక్కూడదు. బెణక్కూడదు. మన పుస్తకం చదివిన అమాయకులకు కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ అన్నమాట గుర్తొచ్చినా, ప్రపంచం బాధ శ్రీశ్రీ బాధ అన్న మాట గుర్తొచ్చినా చలించకూడదు. సరిసమానంగా స్వీకరించాలి. ఎవ్వరొచ్చి ఏమన్నా పుస్తకం కాగితమేనోయ్, మస్తకం మన్నేనోయ్ అన్నపాట దేవదాసులాగా పాడితే సరి! పుస్తకంలో దయ్యం ఎక్కడ దాక్కున్నా దెబ్బకు పారిపోతుంది.

అచ్చుకు ఉన్న గట్టిదనం గచ్చుకు కూడా ఉండదు. వెనకటికి కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారికి ఆంజనేయులుగారనే కవిమిత్రులు ఉండేవారు. ఇద్దరు కలిసి జంటకవిత్వం రాసేవారు. దురదృష్టవశాత్తూ ఆంజనేయులు గారు అకాల ధర్మం చెందారు. విశ్వనాథవారు పడ్డ బాధ అంతా ఇంతాకాదు. ఆయన లేని లోటు తీర్చలేనిదనుకున్నారు. 'ఆతడె తోడుకల్గినను అచ్చముగా కలకండలచ్చులున్ పోతలు పోసి ఉండెదము పోతనగారి విధాన' అన్నారు. కవి హృదయానికి, స్నేహ ధర్మానికి ఇది పరాకాష్ట. కలకండల అచ్చులంటే ఇవే! ఇది ఇంకో రకం.

అచ్చు వేయించుకోవడం అంత తేలికకాదు. అదొక అదృష్టం. బ్రహ్మకు కూడా అంతటి అదృష్టం లేదు. ఆయన అందరి నొసటి రాతలు రాస్తాడంటారు. ఆయన చేత్తో రాయడం తప్ప అచ్చయిన దృష్టాంతాలు లేవు. బ్రహ్మకన్నా ఆ విషయంలో సరస్వతి గొప్పది. ఆమె రాతల్లో చాలా భాగం అచ్చవుతుంటాయి.

కవులూ, రచయితల మాటల్లో కొన్ని అర్థం కాకపోవడం వల్ల జుట్టు పీక్కోవలసి వస్తోంది. అందరూ తమ రచనలను 'అచ్చు వేస్తున్నాం, అచ్చు వేస్తున్నాం' అని గొప్పగా చెబుతుంటారు. ఇంతకన్నా వింత ఏమన్నా ఉందా ? ఇది తిరుగులేని అర్ధ సత్యం! వాళ్ళు తమ పుస్తకాల్లో అచ్చు మాత్రమే వేసుకున్నారా. హల్లులు కూడా వేస్తున్నారుగా! ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నారండీ వీళ్ళు! శతకోటి అచ్చుల్లో అనంతకోటి దోషాలు!'

ప్రపంచ భాషలందు తెలుగులెస్స

"దేశ భాషలందు తెలుగు లెస్స" అని సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు అన్నాడని శతాబ్దాల కాలం నుంచీ గొప్పగా చెప్పుకుంటున్నాం. (లెస్సు అయిందేనని మనల్ని మనం అప్పుడప్పుడు తిట్టుకొంటూ ఉంటాం) నిజానికి మనం చెప్పి ఉబ్బితబ్బిబ్బు కావాల్సిన మాట ఇంకోటి ఉంది. అదే ప్రపంచ భాషలందు తెలుగు లెస్స! ఇందుకు ఎన్నో కారణాలు ఉన్నాయి. 'బతికించే భాష' అని ప్రపంచమంతా టముకు వేస్తున్న ఇంగ్లీష్‌కు ఏ విషయంలోనూ తెలుగు తగ్గదుగాక తగ్గదు. ఆ మాటకొస్తే ఒక మెట్టు పైనే ఉంటుంది. తెలుగు వాడు రాసే అక్షరాలు (సంస్కృత అక్షరాలతో కలిపి) ఇంగ్లీషు వాడి అక్షరాలకు డబుల్ ఉంటాయి. ఇది మనకు 'అక్షరాలా ఆస్తి. సంఖ్యదేముంది అంటారా ? పోనీ తెలుగు అక్షరం ఎంత అందంగా ఉంటుంది! ఐశ్వర్యారాయ్ కన్నా అందంగా ఉంటుంది. భూమి గుండ్రంగా ఉంటుంది. తెలుగు అక్షరం కూడా గుండ్రంగా ఉంటుంది. అందమైన అమ్మాయి ముఖాన్ని చంద్రబింబంతో పోలుస్తారు కవులు. అంతెందుకు ? తెలుగు అక్షరంతో పోలిస్తే సరి! తాము తెలుగు అక్షరం అంతగా అందంగా లేమని మంచి ముత్యాలు తెగ కుమిలిపోతుంటాయి. తెలుగు అక్షరం ఆకారమే ఆకారం. అది చూడడానికి రైల్వే ప్లాట్‌ఫారం మీద లగేజీ తీసుకుని వస్తున్న పోర్టర్ కన్నా ఘనంగా ఉంటుంది. పోర్టర్ తన నెత్తిమీద బ్యాగులు, రెండు చేతుల్లో బ్యాగులు, భుజం మీద

తగిలించుకున్న బ్యాగులతో సహా రైలు బోగీ దగ్గరికి వెళ్తుంటాడు. అతడి కాళ్ళకింద మాత్రం ఏ బ్యాగులూ ఉండవు. కానీ తెలుగు అక్షరం అలాకాదు. నెత్తిమీద అటూ ఇటూ అటూ చివరికి కాళ్ళకింద కూడా ఒత్తులు ఉంటాయి. అసలు సిసలయిన కష్టజీవిలా కనిపిస్తుంది. లేదురా ఇటువంటి భాష ఇంకెందు ? అనిపిస్తుంది.

తెలుగువాడి 'పలుకు' బడి అంతా ఇంతాకాదు. తెలుగును అజంత భాష అనీ, ఇంగ్లీష్‌ను హలంత భాషనీ అంటారు. పదాలు అచ్చుతో అంతమయితే అజంత భాష. హల్లుతో అంతమైతే హలంత భాష. అయితేనేం తెలుగువాడు ఘటనాఘటన సమర్థుడు. ఇంగ్లీష్ భాషను పీకి పాకాన పెడతాడు. ఇంగ్లీష్ భాషను తన సొంత శక్తి సామర్థ్యాలతో అజంత భాషగా చేసేశాడు. Boy అనే ఇంగ్లీష్ మాటను బాయి అని తెలుగు వాడు పలుకుతాడు. Girl అనే ఇంగ్లీష్ మాటను గరలు అని అంటే తప్ప మనవాడికి సంతృప్తి ఉండదు. ప్రపంచంలో మన వాడి 'విజయాలు' అన్నీ ఇన్నీ కావు. దీనినిబట్టి తేలేదేమిటి ?

తెలుగువాడు ఇంగ్లీష్ మాట్లాడుతుంటే తెలుగులాగుంటుంది ? మరి తెలుగు మాట్లాడుతుంటే ఇంగ్లీష్‌లాగుంటుంది. అనంతపురాన్ని అనంటపూర్ అంటే ఎలా ఉంటుంది ? పైగా మన పురాన్ని 'పూర్' చేసేసుకున్నాడు.

గోదావరి ఎక్స్‌ప్రెస్ కాస్తా గొడావరి అయిపోయింది. హైదరాబాద్ 'హైడ్రాబ్యాడ్' అయిపోయింది. రాజమహేంద్రవరం రాజమండ్రి అయిపోయింది.

తెలుగు మధురమైన భాష. సంగీతానికి అనువైన భాష. "Italian of the East' అని కూడా అంటారు. ఇలా కాదు ఇటలీ భాషనే 'తెలుగు ఆఫ్ ది వెస్ట్' అనాలి.

తెలుగు వాక్యం పరమాణువులాంటిది. చిన్న వాక్యం చింతలు లేని వాక్యం. విశ్వనాథ సత్యనారాయణ వచన రచనలు చదివితే తెలుగు వాక్యంలోని అందచందాలు తేటతెల్లమవుతాయి. వాక్యవిన్యాసంలో తెలుగువాడి ముందు తెల్లవాడు బలాదూర్. 'లబలబాదూర్'. మనం ఎంత 'యాక్టివో' వాడంత పాసివ్. 'రాముడు రావణుణ్ణి చంపాడు' అని తెలుగు వాడు ధీమాగా చెబుతాడు. ఇది Active voice. ఇంగ్లీష్ వాడు అలాకాదే. Ravana was killed by Rama అంటాడు. ఇది Passive Voice.

తెలుగువాడి మాట ధోరణి చిత్రవిచిత్రంగా ఉంటుంది. మాయజేసినట్టు ఉంటుంది. ఇతరులకు ఆంతర్యం అంత తొందరగా అంతుబట్టదు. ఒక తెలుగువాడు ఇంకో తెలుగువాడితో ఇలా మాట్లాడుతున్నాడు. "వాడి సంగతి సరే... నీ బుద్ధి ఏమయింది ? గడ్డితిన్నావా? నువ్వు మనిషిని కావా?" అని అంటున్నాడు. ఇన్ని మాటలు విన్న ఎదుటివాడి ముఖంలో కించిత్తు కూడా బాధ కనబడదు పైగా కొన్నిసార్లు నవ్వుతూ వింటుంటాడు. విశేషమేమిటంటే ఆ మాటలు ఎదుటి వాణ్ణి అన్నవి కావు. దూరాన ఉన్న ఎవ్వరినో అన్నవి. ఇటువంటి 'భావవ్యక్తీకరణ' ఎంత అద్భుతం! ఇటువంటివన్నీ భాషస్థాయిని ఆకాశమంత ఎత్తుకు పెంచుతాయి!

ప్రపంచమంతా నెత్తిన పెట్టుకుంటున్న ఇంగ్లీషుకు ఒక విషయంలో తెలుగుతో పోల్చుకునే అర్హత ఏ మాత్రం లేదు. తెలుగు ఉచ్చారణా విధేయమైన భాష. ఏమి రాస్తామో అదే పలుకుతాం – ఏం పలుకుతామో, అదే రాస్తాం. ఎంత కఠినమైనా సరే. ఇంగ్లీష్ వాడికి అంత సీనులేదు.

రాతకు కూతకు సంబంధం ఉండదు. వాడికి సైలెంట్ అక్షరాలు ఉంటాయి. ఎక్కడ ఏ అక్షరం పలుకుతాడో ? ఎక్కడ ఏ అక్షరం సైలెంటుగా ఉంచుతాడో ఇంగ్లీష్ జాతిపిత కూడా చెప్పలేడు. Psychology అని రాస్తాడు. సైకాలజీ అంటాడు. పి పలకడు. పలకని దానికి రాయడమెందుకయ్యా మగడా? అంటే ఉలుకూ పలుకూ ఉండదు. తెలుగులో ఒత్తులు గిత్తులు లేని కడప ఇంగ్లీష్‌వాడి స్పెల్లింగ్‌లో (Cuddapah) అష్టవంకర్లు తిరిగిపోయింది. స్పెల్లింగ్ ఒక రకంగా ఉంటే ఇంకో రకంగా పలకడం ఇంగ్లీష్‌వాడి ఇష్టం ప్రకారం ఉంటుంది. Put ని పుట్ అని పలికిన నోటితోనే But ని బట్ అని పలుకుతాడు. ఏది ఎందుకో ఎవడూ చెప్పలేడు. దీని భావమేమి తెల్లవాడ!

ఎవరేమన్నా తెలుగు అంతర్జాతీయ భాష. 'కలుపుగోలుతనంలో ఇంగ్లీష్‌ను తలదన్నే భాష. అన్ని భాషల పదాల్ని ఇంగ్లీష్ కలిపేసుకుంటే గొప్ప! తెలుగు కలిపేసుకుంటే తప్పా? ఎంత అన్యాయం! సంస్కృతం, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, మరాఠీ లాంటి అనేక భాషల్లో తనకు అవసరమైన శబ్దాల్ని తెలుగు 'జాతీయం' చేసేసుకుంది. ఏవైనా కొన్ని భాషల శబ్దాలు తెలుగులో లేవు అంటే అవి ఆ భాషల దురదృష్టం! తెలుగువాడి 'ప్రయత్న లోపం' ఏమీ ఉండదు.

కన్నడిగుడు తన సొంత భాషలో మాట్లాడుతుంటే కన్నడం వచ్చిన వాడికి తప్ప ఇతరులకు ఒక్క ముక్క అర్థంకాదు. తమిళుడు తన మాతృభాషలో మాట్లాడుతుంటే, తమిళేతరుడికి ఏమీ అర్థం కాదు. తెలుగు తప్ప ఇతర భాషల వాళ్లందరికీ ఇదే పరిస్థితి. మరి తెలుగువాడో! మైకు చేత పుచ్చుకొని 'తెలుగు' లో మాట్లాడుతుంటే అన్ని భాషల వాళ్ళకూ ఎంతో కొంత అర్థమవుతుంది. ఇంతకన్నా గొప్పతనం ఏముంది? మనదే అసలు సిసలయిన అనుసంధాన భాష. (Link Language)

తెలుగు విశిష్టత అ'సంఖ్యా'కమైంది. ప్రపంచం మొత్తం మీద తెలుగు వాళ్ళు 18 కోట్ల మంది (నాతో కలిపి) అని కొంతమంది 15 కోట్ల మంది అని (నన్ను తీసేసి) చెబుతుంటారు. ఇందులో కూడికలు, తీసివేతలు ఉంటాయి. (గుణింతాలు, భాగహారాలు ఉండవులెండి) ఇంతమంది తెలుగు వాళ్లు ఉన్నా, అంతమందీ తెలుగు మాట్లాడరేమి అని ఇంగ్లీష్‌లో పెదవి విరిచే వాళ్ళు ఎంతోమంది తారసపడుతుంటారు. ఇందుకు కారణాలు రెండు. మన భాష మన సొంతం. ఎప్పుడయినా నేర్చుకోవచ్చు. ఎప్పుడయినా మాట్లాడుకోవచ్చు. ముందు ఇతర భాషల అంతుచూస్తే సరి! రెండో కారణం తిరుగులేనిది. మన భాషకు విలువ కట్టే షరాబు లేడు. తెలుగు బంగారం లాంటి భాష. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' లో తెలుగు తల్లిని గురించి ఏం పాడుకుంటాం! కడుపులో బంగారు అని! కానీ బంగారాన్ని దాచుకుంటామా? లేదా? అలాగే విలువయిన తెలుగునూ దాచుకుంటాం? తప్పేముంది?

ఎక్కువమంది మాట్లాడకపోయినా తెలుగుకు వచ్చే నష్టమేమిటిట? మన భాష విలువ ఏం తగ్గుతుందిట! సంస్కృతంతో పోల్చి చూస్తే తెలుగు వెలుగు బయటికొస్తుంది. సంస్కృతాన్ని అన్ని భాషలు తల్లి అని తెలుగు పండితులు చెబుతారు. 'జనని సంస్కృతంబు సకల భాషలకును' అన్న పద్యం కూడా ఉంది. ఆ సంస్కృతాన్ని ప్రపంచం మొత్తం మీద ఇప్పుడు ఎంత మంది మాట్లాడుతున్నారు ? ఒకప్పుడు అమృతభాష అన్నారు. ఇప్పుడు మృతభాష అంటున్నారు. అయినా సంస్కృతం విలువ ఏం తగ్గింది? హిందువుల్లో పెళ్ళిల్లాంటి

శుభకార్యాలకైనా, చావుల్లాంటి అశుభ కార్యాలకైనా సంస్కృతం లేకుంటే కుదరదు! ఆ సంస్కృతాన్ని తననిండా నింపుకున్న భాష తెలుగే! ఇటువంటి విషయాల్లో అడుగుజాడ కవులదే. కవిసార్వభౌముడు శ్రీనాథుణ్ణి సంస్కృత పండితులు హేళన చేశారు. నీ పద్యాల్లోని డు, ము, వులను నీవు తీసుకెళ్లి మిగతా సంస్కృత భాషను మాకు ఇచ్చెయ్యి అని చమత్కరించారట.

అటు సంస్కృతాన్ని, ఇటు ఇంగ్లీష్‌ను తాను మనసారా ఆహ్వానించి 'కథ నడిపించడం' తెలుగువాడికి మాత్రమే చేతనవుతుంది. తెలుగు భాష అమ్మంత నమ్మకమయింది. బందరు లడ్డంత, ఆత్రేయపురం పూతరేకులంత తియ్యనయింది. అయినా తెలుగు వాడు ఏ మాత్రం పక్షపాతం లేని నిస్వార్థపరుడు.

"స్వభాషే నిధనం శ్రేయః

పరభాషో భయావహః"

(స్వభాషలో చావడం మంచిది. పరభాష భయావహమైంది) అని సాక్షాత్తూ శ్రీకృష్ణపరమాత్ముడు దివినుంచి భువికి దిగివచ్చి చెప్పినా మనం వినం. భావకవితా పితామహుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి కలలోకి వచ్చి పక్కన కూర్చుని చిలకకు చెప్పినట్టు చెప్పినా వినం!

తెలుగువాడు తెలుగువాడే! మారడు గాక మారడు.

పిబరే హ్యూమరసం

"పిబరే రామరసం" అన్న మాట ఆధ్యాత్మిక ప్రియులందరికీ వీనులవిందు కలిగిస్తుంది. ఇందులో పరం ఉంది. దీంతో పాటు 'పిబరే హ్యూమరసం" అంటున్నారు. హాస్యరసం అంటే ఇహానికి పరానికి అనుసంధానమైంది. హాస్యం శరీరానికి ఉత్తేజం కలిగిస్తుంది.'శరీరం ఆద్యం ఖలు ధర్మసాధనం' అన్నారు కదా! ధర్మసాధనకు శరీరం మొదటిది అని దీని అర్థం. అందువల్ల హాస్యరసం ధర్మసాధనకు మార్గం సుగమం చేస్తుంది.

'నవరసములందు నవ్వు రసము వేరయా విశ్వదాభిరామ వినుర వేమ' అని మన వేమన అనకపోయినా ఇది 'పచ్చి' నిజం, 'ఎండు' నిజం కూడా! జెండాపై కపిరాజు అన్న పద్యం ఉంది కదా! కపిరాజు పని కిచకిచలు పెట్టి నవ్వించడమేగా! మనిషి కన్నా కోతి ముందు పుట్టింది. అంటే నవ్వు ముందు పుట్టినట్టే కదా! 'నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును' అన్న పద్యం వింటే కోతి కాస్త బాధపడిపోతుంది. నేనూ నవ్వుతాను గదా అంటుంది! పోనీలే! నవరసాల్లో ఏది గొప్ప అనే చర్చ ఎప్పటినుంచో ఉంది! 'ఏకో రసః కరుణయేవ' అని మహాకవి భవభూతి అన్నాడు.

ఒకసారి హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో నేను హాస్యావధానం చేశాను. దానికి దివంగత నటసమ్రాట్, రొమాంటిక్

హీరో అక్కినేని నాగేశ్వరరావు గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నవరసాల్లో మొదటి స్థానం శృంగారానిది. అది పుట్టుకకు కారణమవుతుంది. కాబట్టి రెండో స్థానం హాస్యానిది అన్నారు. నాకు 'మొహమాటం' ఉండదు. మొహమాటానికి పోతే ఏమవుతుందన్న సంగతి తెలుగువాళ్లందరికీ తెలిసిన విషయమే. 'నవరసాల్లో మొదటిస్థానం హాస్యరసానిదే. శృంగారానిదే అన్న అక్కినేని గారితో నేను విభేదిస్తున్నాను' అని నేను అక్కినేని గారి ముందే స్పష్టంగా చెప్పాను. కుండబద్దలు కొడదామనుకున్నాను. సమయానికి దగ్గరలో కుండలు దొరక్కపోవటం వల్ల అంతపని చేయలేదు. అయితేనేం శృంగారానికి, హాస్యానికి తేడాలు నా కార్యక్రమంలో వివరించాను. హాస్యం గొప్పతనాన్ని క్రమంగా చెప్పాను. పాయింట్లన్నీ చెప్పి జాయింటు చేశాను. అవి ఇవీ.

1) శృంగారం ప్రాణి పుట్టుకకు ఉపయోగపడుతుంది. కానీ ఆనందంగా జీవించడానికి అంతగా ఉపయోగపడదు. ఏదీ తొందరగా తేలనివ్వదు. పెళ్ళి కానివాడు ఎందుకు కాలేదా ? అని ఏడుస్తుంటే పెళ్ళయిన వాడు ఎందుకు అయిందా అని ఏడుస్తుంటాడు. ఎటొచ్చీ అంతా ఏడుపే. కానీ హాస్యం వల్ల అంతా ఆనందమే! మనిషి ఏడుస్తూ పుడతాడు. ఏడిపిస్తూ చనిపోతాడు. మధ్యలో అంతా నవ్వులమయం కాని వాడి జీవితం వృథా ... వృథా... వృథా ....!

2) శృంగారం ఇన్‌డోర్ ... ప్రైవేట్. అంతా రహస్యం. ఔట్‌డోర్‌గా పనికిరాదు. హాస్యం అలాకాదు. ఇది ఇన్‌డోర్‌గా పనికొస్తుంది. అవుట్ డోర్‌గా కూడా పనికొస్తుంది. ప్రైవేట్‌గా, పబ్లిక్‌గా పనికొస్తుంది. శృంగారం దర్శనం ప్రదర్శనం నిషిద్ధం. హాస్యానికి అటువంటి ఆంక్షలు లేవు. కాంక్షలు ఉంటే చాలు.

3) హద్దులు దాటిన శృంగారానికి ఎయిడ్స్ ప్రాబ్లమ్ ఉంటుంది. పోలీసు రెయిడ్స్ ప్రాబ్లమ్ ఉంటుంది. హాస్యానికి ఇటువంటి సమస్య లేవీ ఉండవు.

4) శృంగారం ఇద్దరి మధ్య వ్యవహారం. భార్యాభర్తలకు మాత్రమే పరిమితం. ఇతరులతో శృంగారం నిషిద్ధం. హాస్యం ఎవరితోనైనా పంచుకోవచ్చు. వావివరుసలు కూడా లేవు.

5) శృంగారానికి వాతావరణం ముఖ్యం. పండు వెన్నెల మంచిది. మండుటెండలో కష్టం. హాస్యానికి పండు వెన్నెలయినా ఒకటే... మండు టెండలయినా ఒకటే. ఎటువంటి భేదమూ లేదు.

6) శృంగారానికి శ్రమ అవసరం. అనంతరం ఉన్న శక్తి తగ్గి విశ్రాంతి అవసరం. హాస్యానికి ఎటువంటి శ్రమా ఉండదు. విశ్రాంతీ అవసరం లేదు. హాస్యంతో కొత్తశక్తి వస్తుంది.

7) శృంగారం విజయవంతంకావడానికి సిద్ధమకరధ్వజం, ఊరపిచ్చుక లేహ్యం లాంటి ఔషధాలను వినియోగించేవారు ఉన్నారు. హాస్యానికి ఇటువంటివేవీ అవసరం లేదు. హాస్యమే మంచి ఔషధం. 'Laughter is the best medicine'' అని ఇంగ్లీష్ వాడు మనందరం పుట్టకముందే చెప్పి ఏడ్చాడు.

8) శృంగారం యౌవనంలో మాత్రమే ఉపయోగపడుతుంది. బాల్యంలోనూ ఉపయోగపడదు. ముసలితనంలోనూ ఉపయోగపడదు. హాస్యం అలాకాదు. పుట్టినప్పటినుంచీ కన్నుమూసేవరకు మనిషి నవ్వగలడు.. నవ్వించగలడు. ఇందుకు ఉదాహరణ ఉంది. తెలుగువాడికి మొదటి జ్ఞానపీఠాన్ని తెచ్చి పెట్టిన మహనీయుడు కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు. ఆయన చనిపోయే ముందు గుంటూరు జనరల్

హాస్పిటల్‌లో చేరారు. అప్పుడు నేను నాగార్జున యూనివర్సిటీలో తెలుగు ఎం.ఎ చదువుతున్నాను. నేను తెలుగు ఎం.ఎ చదవడం వల్ల ఆయన బాధపడి చనిపోలేదు. ఇది పాఠకులు గమనించాలి. అయితే విశ్వనాథ వారు ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసి ఆయన అభిమాని రవి కాలేజి వ్యవస్థాపకులు సి.వి.ఎన్.ధన్‌గారు గుంటూరు జనరల్ హాస్పిటల్‌కు చేరుకున్నారు. ముందు డాక్టర్లను అడిగారు... 'విశ్వనాథ వారి ఆరోగ్యం ఎలా ఉన్నదీ?' అని. డాక్టర్లు 'భయం లేదు' అని చెప్పారు. ధన్‌గారు సంతోషించారు. ధనాధన్ అంటూ విశ్వనాథ వారి దగ్గరికి వెళ్లారు. 'విశ్వనాథగారూ! మీ ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగాను. భయం లేదు అని వాళ్లు చెప్పారు' అన్నారు. అప్పుడు విశ్వనాథ వారు ఏమన్నారో తెలుసా..... "డాక్టర్లకేం భయం! చస్తానని నాకు భయం కానీ' అన్నారు. అందరినీ నవ్వించారు. తర్వాత అరగంటలో చనిపోయారు. ఇదీ హాస్య మాహాత్మ్యం!

9) అపార్థం వల్ల కూడా నవ్వు వస్తుంది. శృంగారానికి ఇది సాధ్యం కాదు. ఒక ఆసుపత్రిలో 90 ఏళ్ల పండు ముసలి ఉన్నాడు. అతడు ఎలా ఉన్నాడు?' అని అడిగారు. 'ఏముంది? నర్సు వచ్చినప్పుడు కళ్లు తెరిచి చూస్తున్నాడు' అన్నారు. అందరూ నవ్వారు. ఆయన కళ్ళు తెరిచింది మందు కోసమే తప్ప పొందుకోసం కాదు. కానీ దానిని అన్యాయంగా అపార్థం చేసుకొని అందరూ నవ్వారు.

10) ఏడాదిలో శృంగారానికి అనుకూలమైన ప్రత్యేకమైన సీజన్ ఉంటుంది. అది చలికాలం. హాస్యానికి ఏడాది అంతా అనుకూలమే. ఏ కాలమైనా ఫర్వాలేదు. అన్ని సంవత్సరాలు ఒకటే. మన్మథ నామ సంవత్సరమైనా, ఖరనామ సంవత్సరమైనా ఒకటే. తేడా లేదు.

11) శృంగారానికి ఆరోగ్యం బాగుండాలి. అయితే అనారోగ్యం ఉన్నా హాస్యం చేయొచ్చు. ఇలా వరసపెట్టి శృంగారానికి హాస్యానికి తేడాలు చెప్పి.... ఇప్పుడు చెప్పండి.... ఏ రసం గొప్పది అని అడిగాను ప్రేక్షకులందరూ ఏకగ్రీవంగా హాస్యరసమే గొప్పదని అరిచి చప్పట్లు కొట్టారు. అందుకే "హాస్యోరక్షతి రక్షితః" అన్నాను. హాస్యాన్ని మనం రక్షించుకుంటే హాస్యం మనల్ని రక్షిస్తుంది. ఏ దేహానికీ ఇందులో సందేహం అక్కర్లేదు. నాకు మరీ పక్షపాతం అనుకోకండి. నవరసాల్లో ఒకదానితో ఒకటి పోలిస్తే హాస్యం గొప్పది. అయితే హాస్యంతో సహా నవరసాలన్నిటి కన్నా మించిందీ, వాటన్నింటినీ ముంచిందీ వేరే రసం ఒకటుంది. అదే నీరసం! ఏ రసమైనా ఎక్కువగా అనుభవిస్తే వచ్చేది నీరసమేగా! కండలు తిరిగిన వీరుడైనా దీనిని ఒప్పుకోక తప్పదు. నీరసమూ జిందాబాద్!

దోమా కలాపం

'ఏదండి ముందుకు
పదండి తోసుకు
పనిబడదాం పద దోమలను
దొరకబుచ్చుకొని చంపేద్దాం' అంటూ ఎందుకయ్యా పరగడుపున లేచి 'సామూహిక దోమల హత్యాకాండ'కు బయలుదేరారు ? ఎందుకని మా ప్రాణాలు తోడిపారేస్తున్నారు ? మా 'దినం' కోసం ప్రత్యేకంగా ఒక దినం కూడా పెట్టుకున్నారు ? ఏం పాపం చేశామయ్యా మేం! మాటవరసకు పాపమే చేశామని ఒప్పుకొంటాం. కానీ మాకన్నా పాపాలు చేసిన 'ధనానుభావులు' ఎందరో ఉన్నారు. వారి సంగతేమిటి ? కోర్టులు 'విచారిస్తున్నాయి' తప్ప వాళ్లు విచారించడంలేదు. కేసుల ఊసులు వినిపిస్తున్నాయి తప్ప, శిక్షలు ఎప్పుడో తెలీదు. విచారణలు పూర్తయ్యేటప్పటికి ఏండ్లూ పూండ్లూ పడుతున్నాయి. ఇదే న్యాయం మాకూ కావాలి.

దోమలం అంటే ఒక రకమైన సంగీత విద్వాంసులం! ఒకానొక నృత్య విశేష దర్శకులం. అనవసరంగా మా జోలికొచ్చి కళల మీద ఎందుకు కత్తి కడతారు ? మా మీద కూడా కేసులు పెట్టి విచారణ జరిపి ఫలానా దోమ ఫలానా తప్పుచేసింది కాబట్టి ఫలానా శిక్ష వేస్తున్నాం అని చెప్పండి. అవసరమైతే 'దోమ నేర శిక్షాస్మృతి' అంటూ

చట్టాన్ని తీసుకురండి. అదీ పద్ధతి. ఎన్నేళ్లయినా జైళ్లలో మగ్గుతాం. ఇందుకు విడివిడిగా మేమే బాధ్యత వహిస్తాం.అంతేకానీ, కొందరు మంత్రుల్లాగా సమిష్టి బాధ్యత అంటూ తప్పించుకోం. మాకు న్యాయ సహాయం కావాలంటూ అర్థించే ప్రసక్తే లేదు. ఏ జైల్లో ఉండమంటే ఆ జైల్లో పడి ఉంటాం. మాకూ అవకాశం ఇవ్వండి! ఎందుకు తక్షణ శిక్షలు. అదీ మరణశిక్షలు విధిస్తారు! ఉరితీసే ముందు నీ కోరిక ఏమిటి అని అడుగుతారు. తీరుస్తారు. దోమల్ని చంపేముందు ఎప్పుడైనా దోమా దోమా... నీ చివరి కోరిక ఏమిటని అడిగిన పుణ్యాన పోయారా ? పైగా పుండుమీద కారం రాసినట్టు దోమల మీద కథలు, కవిత్వాలు, చమత్కారాలు, వ్యంగ్యాస్త్రాలు!! ఇదేం అన్యాయం!

దోమ రాత్రే కుడుతుంది... భామ పగలు రాత్రి 'కుడుతుంది' అంటూ ఒకాయన పళ్లికిలించాడు. మరి భామ మీద ప్రేమ చూపిస్తూ, దోమ మీద పగబడతారేం ? పొగ పెడతారేం ? మా విధులు మేము నిర్వహిస్తున్నాం. మీరెంత అపరిశుభ్రంగా ఉంటే అంతగా రెచ్చిపోతాం. మా 'చేవల్ని' ఎవరూ గుర్తించరేం. మాకే ఓట్లు గనక ఉంటే ఈ ప్రభుత్వాలనే కలకాలం నిలబెడతాం. పడగొట్టేవాళ్లను కుట్టికుట్టి ఉసురుతీస్తాం. ఇదో రకం 'క్విడ్ ప్రొ కో' అన్నా లెక్కపెట్టం. యమధర్మరాజు చేసే పనినే మేమూ చేస్తున్నాం. భూతలంలోనే నరకం చూపిస్తున్నాం. చచ్చి 'చెడీ' నరకానికి వెళ్లినా అప్పుడు ఇబ్బందే ఉండదు. చికున్‌గున్యా అని పేరు పెట్టినా, డెంగ్యూ అని హోరెత్తించినా దోమ దోమే! అయినా 'కుట్టుజాతి'లో ఐక్యత లేకపోబట్టే కదూ మాకు ఇన్ని కష్టాలు!

'తేలూ, పామూ

దోమా, చీమ

నల్లీ, పేను' – పేరు ఏదైతేనేం అంతా కుట్టుజాతిలో సభ్యత్వం ఉన్న ప్రాణులే. మనిషి ఆగడాలు ఆగడమేలేదు. 'తలనుండు' విషము ఫణికిని... అని మొదలుపెట్టి ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ' అని మనిషి పద్యం చదువుతాడు తప్ప పాముల్ని, తేళ్లను చంపడం మానుకోడు.

ముక్కోటి దేవతలంటూ దేవతలకు ఓ లెక్క ఉంది.రాక్షసులకే ఆ లెక్క ఎక్కడా లేదు. కాబట్టి ఉత్తిపుణ్యానికి రాక్షసుల సంఖ్య పెంచుతుంటారు. ఇలాగే 'దోమాసురులు' అనే మాట పుట్టింది. ఎంత శక్తి ఉన్నా దోమలకు ఓట్లు లేవు. అవి ఓట్లు వేయించుకోవడమూ లేదు. గద్దెలు ఎక్కడమూ లేదు. తైతక్కలాడటమూ లేదు. మలేరియా నుంచి బోదకాలు వరకు అన్ని ప్రాంతాల్లో దోమలదే రాజ్యమైనా ఫలితం లేదు. 'కుట్టు' చప్పుడు కాకుండా ప్రజాధనం మాయం చేసి, దానికి 'ప్రజా సంక్షేమం' అంటూ ముసుగేసి 'బొక్కి' వక్కాణించిన పేరు గొప్ప నాయకుల సంగతేమిటి ?

ఇట్లు,

ప్రేమపాశంతో మిమ్మల్ని బంధించే ... మీ దోమ.

రాసకీయ రహస్యం

'రాజకీయాలవల్ల ఫలితం ఏముందని ఏమాత్రం 'పదవి' విరచనక్కరలేదు. రాజకీయాలు 'వంట' పడితే చాలు. 'యావ'త్ భూప్రపంచంలో తెలియని విషయం అంటూ ఏమీ ఉండదు. పొట్టకోసి చూసినా అక్షరమ్ముక్కలేని రాజకీయ నాయకుడి దగ్గర కూడా కొమ్ములు తిరిగిన ఐఎఎస్ అధికారులు బుద్ధిగా చేతులు కట్టుకునో, దస్త్రాలు పట్టుకునో వెర్రిమొహాలు వేసుకుని నిలుచుంటారంటే మాటలు కాదు. కొంతమంది నాయకులు త్రికాలజ్ఞులు. రాత్రి కాలజ్ఞులు కూడా. వారిని కదిలిస్తే కల్యాణం మొదలుకొని లోక కల్యాణం వరకూ కనిపించని రసపట్టు గుట్టుమట్టులు సైతం పట్టువిడుపులు లేకుండా చెప్పగలరు. ఒక్కొక్కప్పుడు ఇవి రాజకీయాలా, రాసకీయాలా అని అనిపించగలరు. వారి మాటలు ఆసాంతం వింటే చాలు. ఒక్కోసారి వైరాగ్యం కూడా గుండెల గట్లు తెంచుకుని వచ్చేస్తుంది.

అంతేకాదు 'సన్యాసీ సుఖీభవ, సంసారీ దుఃఖీభవ' అని ఇంతకాలం వాడుతున్న మాటల ఆంతర్యం వింతగా బయటపడి పోతుంది. ఎన్ని పరిశోధనలు చేసినా అంత విజ్ఞానం అసాధ్యం. సైంటిస్టులు సైతం ఊహించని స్వయంటిస్టులు అందులో బారులుతీరి

ఉంటాయి. కుక్కపిల్ల, సబ్బుబిళ్ల కాదేదీ రాజకీయానికి అనర్హం అనిపిస్తాయి. 'చదువులలో సారమెల్ల చదివితి తండ్రీ' అని ప్రహ్లాదుడు చెప్పేస్తే అతడి తండ్రి హిరణ్యకశిపుడు నమ్మి అందులో ఉన్న 'రాజకీయం' అర్థంకాక బోల్తాపడ్డాడు. ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అందువల్ల రాజకీయం చదువుల సారమే! ఈ మధ్య ఒక నాయకుడు చేసిన 'తనుగ్రహ భాషణం' వింటే ఎవరైనా ఆశ్చర్యచకితులు కాకతప్పదు. విన్న తరువాత ఎవరికైనా అలౌకిక ఆనందం కలుగుతుంది. ఇవి మహత్తరమైన ధర్మసూక్ష్మం.

'రోజూ పడక మృత్యువు వైపు నడక' అన్న సరికొత్త తీర్మానం వెలుగులోకి వచ్చేసింది. 'రతి సర్వత్ర వర్జయేత్' అన్నట్టు ఒక పెద్దమనిషి మాట్లాడేశారు. షాక్ ఇచ్చారు. శృంగారం వల్ల కేలరీలు తగ్గి, ఆరోగ్యం బంగారంలా తయారవుతుందని నమ్మేవాళ్లూ ఆలోచనల్లో పడిపోయారు. ఏది సత్యం. ఏదసత్యం. ఓ మహాత్మా, ఓ వాత్సాయన మహర్షీ! అని అనుకుంటున్నారు. 'రవి గాంచనిచో కవి గాంచును కదా' అని ఇప్పటిదాకా విన్నాం. దాన్ని కాస్త మార్చుకుని 'రవిగాంచనిచో రాజకీయ నాయకుడు గాంచునో ఏమో!' అన్న అనుమానం చివరికి వాత్సాయనుడికీ వచ్చేట్లుంది. 'పెళ్లంటే ఒక పీడకల' అనే పాట విని అనేకమంది ఇదేం వైపరీత్యం అనుకునే పరిస్థితికి ఇది దారేమో! 'తాళి కట్టు శుభవేళ' అన్న మాటలు విని కుర్రకారు బేజారైనా కావచ్చు. బిడ్డకూ బిడ్డకూ ఎడం కాదు... తడవకూ తడవకూ ఇంతింత ఎడం అంటే బిత్తరపోనూ వచ్చు!

'తాళికట్టనేల... కట్టితిని పో... కొత్త కాపురం పెట్టనేలా... పెట్టితిని పో... పీకల్లోతు కూరుకుపోయి సంసారంలో మునిగితినేల.. మునిగితిని పో... జీవితమే మునిగిపోనేల' అని శృంగార రారాజులు పశ్చాత్తాపపడుతుంటే డజన్ల సంఖ్యలో పిల్లల్నిగన్న పెద్దవాళ్లు ముక్కున వేలేసుకోక తప్పదు. ఎలా చూసినా పెళ్లి అనేది ఓ విచిత్ర వ్యవహారమే. ఇది ఒకరకంగా ఆరోగ్యకరమైన చర్చే. సన్యాసులు శారీరక సంబంధాలకు దూరంగా ఉన్నందువల్ల సంతోషంగా ఉండి ఎక్కువకాలం బతుకుతారనే వాళ్లూ ఉన్నారు. అదే నిజమైతే 'కామిగాక మోక్షగామి కాడు' అని వేమన యోగి ఎందుకంటాడని ప్రశ్నించేవాళ్లూ ఉన్నారు. ఇవన్నీ ఆలోచిస్తే ఎంత దట్టమైన జుట్టు ఉన్నవాళ్లకైనా బట్టతల రాకతప్పదు.

ఇంత శ్రమ ఎందుకు? రాజకీయ నాయకులకు చెబితే ఏదో బిల్లు తెచ్చి సమస్యను పరిష్కరించి నిగ్గుతేలుస్తారు. విగ్గు అవసరం రానివ్వరు. నాయకులు ఏ శాస్త్రం తెలుసని అలా చెప్పగలరని నిలదీసే శక్తిసామర్థ్యాలు లేవు కాబట్టి ఎంత దమ్మున్నా గమ్మున ఉండిపోగలరు. నాయకులు ఏం చెప్పినా వారి స్వార్థం మాత్రం ఏమి ఉంటుంది? దేశానికి మా పార్టీలకు ఓట్లు తగ్గినా ఫర్వాలేదు అనుకుని 'మిత సంతానం అమితానందం' అని ఎందుకు ప్రచారం చేస్తారు ?

రాజకీయ నాయకుడే చెప్పిన తరవాత ఎవ్వరూ ఫీలు కానవసరమూ లేదు. అప్పీలుకు వెళ్లనవసరమూ లేదు. సంసారం సాగరమనీ, నరకమనీ... ఒకటి కాదు... రెండు కాదు సంసారాల మీద అలల కొద్దీ చెడ్డవలల కొద్దీ ఎన్నికల ప్రచారాన్ని మించి ఎన్ని ప్రచారాలు! ఇవన్నీ నమ్మితే గృహస్థాశ్రమం అంటే ఓ 'గుహస్థాశ్రమం'

అని భయపడనూ వచ్చు! 'పెళ్లికేం తొందర... వయసు మీదపడనీ ముందర' అని కాలయాపన కూడా చేయవచ్చు. కాటికి కాలు జాపే వయసు వచ్చేవరకు తోడు గురించి, జోడు గురించి వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టుకోవచ్చు. అప్పుడు 'సైన్సు' కూడా మార్చేసి, కొత్త సిద్ధాంతాలను పేర్చేసుకున్నవాళ్లకే ప్రాచుర్యం లభించనూవచ్చు.

'విజాతి ధ్రువాలు ఆకర్షించుకొంటాయి. సజాతి ధ్రువాలు వికర్షించుకుంటా'యన్న తాతలనాటి పాత సిద్ధాంతాలను వదిలేసే రోజులు వచ్చేశాయి. సజాతి ధ్రువాలే ఆకర్షించుకునే స్వలింగ వివాహాలు జరిగిపోతున్నాయి. 'కలయిక ఇక కల' అనే ప్రచారాలూ చోటు చేసుకుంటున్నాయి. 'కలయిక వద్దు... కలిసి ఉంటే అదే ముద్దు' అనుకుంటే కొంప కొల్లేరు అవుతుందని కంగారుపడుతున్న రసిక శిఖామణులూ ఉన్నారు.

సైన్సు రాజకీయం సైన్సుకూ ఉంది. అది ఎప్పుడు ఏం చెబుతుందో ఎవరికీ తెలీదు. సైన్సుకు ఉన్న లైసెన్సు కూడా అదే. ఎప్పుడు కీచులాడుకునే దంపతులు ఎక్కువ కాలం బతుకుతారని ఆ మధ్య ఓ పరిశోధన వెల్లడించింది. పార్లమెంటు సభ్యుడి మాటలకు దానికి కూడా లింకు ఉందేమో!

అంతా శాస్త్రవేత్తలకెరుక.. పరిశోధనలకెరుక!

నవ్వు కనబడుట లేదు

చట్టసభల్లో హాస్యం కరువైందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బాధపడ్డారు. ఒకప్పుడు రామ్‌మనోహర్ లోహియా, పీలూ మోడీ లాంటివాళ్లు పార్లమెంటులో నవ్వుల పువ్వులు పూయించేవారు. వారి మాటల్లో స్పందనల్లో హాస్యంతో పాటు గొప్ప సందేశమూ ఉండేది. స్వతంత్ర పార్టీ నాయకుడు పీలూ మోడీ స్థూలకాయుడు. తన మీద తానే జోకులు వేసుకుని అందరినీ నవ్వించేవారు. ఇక రామ్ మనోహర్ లోహియా గురించి చెప్పేదేముంది ? ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మీద సైతం నవ్వుల బాణాలు సంధించేవారు. నెహ్రూ కూడా నవ్వేసేవారు. రాజకీయ ప్రత్యర్థులైనా మనసులో ఆపేక్ష ఉండేది తప్ప, కక్ష ఉండేది కాదు. అంతా హాస్య కుశలోపరి!

యుద్ధంలో చైనావాళ్లు ఆక్రమించుకున్న భూభాగంలో మొక్కయినా మొలవదు. ఆ భూమి పోయినా నష్టం లేదన్నట్టుగా నెహ్రూ మాట్లాడగానే, లోహియా ఆయనకు ఊహించని జవాబిచ్చారు. 'మీ బట్ట తలమీద కూడా ఏమీ మొలవదు కదా... దాన్ని కూడా వదిలెయ్యండి' అని లోహియా అనేసరికి, మాటపడ్డ నెహ్రూ సైతం నవ్వుకోక తప్పలేదు. అంతేకాదు, తనకు వ్యతిరేకంగా కార్టూన్ వచ్చినా ఆయన ఆనందించే వారు. ప్రోత్సహించేవారు. ఒకప్పుడు నవ్వుల జలపాతాలు కనిపించిన చట్టసభలు ఇప్పుడు పేలవంగా ఎందుకు మారిపోయాయి? షడ్రసో పేతమైన సంభాషణల విందు భోజనాన్ని వడ్డించిన సభలు రణరంగాల్ని ఎందుకు తలపిస్తున్నాయి? 'ఏవి నేతా! అప్పుడు కురిసిన హాస్య సమూహాలు' అనాలనిపిస్తోంది. 'ఎవ్వనిచే జనించు నవ్వు ఎవ్వనిలోపల నుండు లీనమై' అని ప్రార్థించుకోవలసిన పరిస్థితులు వచ్చేశాయి.

ఇప్పుడు జోకులు దూసుకొచ్చే రాజకీయం కనబడటం లేదు గానీ, ఎన్నికల్లో బాకులు దూసి గెలిచిన కొందరు ప్రతినిధులతో 'క్రిమినలభీమపాకం' వేడివేడిగా తయారవుతోంది! నేరచరిత్రలు లేదా బేరచరిత్రలు నిండిన నాయకులు చట్టసభల్లో అడుగుపెడుతుంటే నవ్వులు ఎలా పూస్తాయి ? కేసులు గుసగుసలాడటం తప్ప నవ్వుల ఊసులు ఎలా రెపరెపలాడతాయి ? టపటపా రాలతాయి! ఎవరి ప్రాణం తీద్దామా, ఎవరి ఆస్తులు కొట్టేద్దామా, ఖజానాను ఎలా కొల్లగొడదామా, ఇళ్ల నిర్మాణం పేరిట ఎవరి కొంపలు ముంచేద్దామా అన్న 'యావ' గేషన్ ఉన్నవాళ్లు తగుదునమ్మా అని నాయకవేషం ధరిస్తుంటే జోకుల సంగతి దేవుడెరుగు! పొట్టచెక్కలు కావడానికి బదులు మైకులు ముక్కలవుతున్నాయి. వారిదంతా భుజస్వామ్యం. జట్టు కట్టుకుని, జుట్టూజుట్టూ పట్టుకున్న సందర్భాలూ ఉన్నాయి. సంస్కారానికి దహన సంస్కారం జరుగుతోంది!

మీ ప్రభుత్వంలో ఫలానా అక్రమం జరుగుతోందని ఎవరైనా ప్రతిపక్ష నాయకుడు అంటే – దానికి జవాబు చెప్పడం పోయి, నువ్వు అధికారంలో ఉన్నప్పుడు అది జరిగింది... ఇది జరిగిందంటూ రకరకాల అభూతకల్పనలు చేసి వికటాట్టహాసాలతో విరుచుకుపడ్డ వారిని చూశాం.

మన ఆత్రేయ నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే అని ఎప్పుడో అనేశారు. తిట్లు తిట్టి అవే 'విట్లు' అని భ్రమింపజేయడానికి ప్రయత్నించిన నాయకులూ ఉన్నారు. వెకిలి నవ్వులు నవ్వి అవే నవ్వులన్నట్టు ప్రవర్తించిన జోకాసురులూ ఉన్నారు. నవ్వితే తామే నవ్వాలి, ఇతరులు నవ్వడానికి వీల్లేదన్నట్టు విర్రవీగిన నాయకులూ ఉన్నారు. అధికార పక్షానికే నవ్వడానికి స్వాతంత్ర్యం ఉందిగాని, ప్రతిపక్షం నవ్వడానికి వీల్లేదన్నట్లు అధికారపక్షం నాయకులు చెలరేగిపోయిన సందర్భాలూ

ఉన్నాయి. అప్పుడు 'పాపం నవ్వే నేరమాయెనా' అనీ జనానికి అనిపించేది. అటువంటి పరిస్థితుల్లో నవ్వేం కనిపిస్తుంది 'కనబడలేదా! మరో ప్రపంచపు కణకణ మండే త్రేతాగ్ని' అన్న శ్రీశ్రీ మాటే కనిపిస్తుంది.

నవ్వించడం కోసం తెలుగు వాళ్లు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. నవ్వు విలువ అంతా ఇంతా కాదు. 'ఒక్క నవ్వే చాలు వద్దులే వరహాలు' అన్న పాటా ఉంది. అడుగుజాడ గురజాడది అనిపించుకున్న గురజాడ సైతం నవ్వించాలని ఎంతో అవస్థపడ్డాడు!

'నవ్వనంటావీవు
నీవిక
నవ్వకుంటే మించిపాయెన
కొయ్యబొమ్మలు మెచ్చు కళ్లకు
కోమలుల సారెక్కునా' అని ఆయన బాధపడ్డాడు.

ఇదంతా పాత కథ కాదు.ఎప్పటికప్పుడు కొత్త కథే. ఎన్నికల ప్రణాళికల్లో ఎన్నో పనులు చేస్తామని పార్టీలు అనేక హామీలిస్తుంటాయి. అవన్నీ జనాన్ని ఆకట్టుకోవు. ఇంతకాలంలో జనాన్నంతా మేం నవ్విస్తాం అని కచ్చితంగా ఏ పార్టీ అన్నా – ఆ పార్టీకి ఓట్లపంట పండుతుంది !

'ఆడది అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరుగాడిన రోజే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిన రోజు' అని జాతిపిత మహాత్మాగాంధీ అనేవారు. అదే ఇప్పటి రోజుల్లో అయితేనా... ఆడా మగా ఎవరైతేనేం. అందరూ హాయిగా నవ్వుకోగలిగిన రోజే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిన రోజు.

నాయకులూ...మీ నవ్వుల సంగతేమైనా, జనానికి అయినా నవ్వులు పంచండి. సార్లూ! దేశానికి నిజమైన స్వాతంత్ర్యం తీసుకురండి!

హాస్య 'కథ'క్కళి

'క్షోభ'నం

ఊపాయి కాసంత బొట్టు పెట్టుకున్న మా బామ్మ నన్ను ముందుకు నెట్టింది. కాస్తంత కాలు జారినా పాలగ్లాసు పట్టుకొన్న నేను ఎలాగో నిలదొక్కుకున్నాను. బామ్మ మాట బంగారు బాట కదా! ఆమె మాట వినాల్సిందే. బామ్మ అర్హతలు కూడా అలాంటివి కావు. బామ్మ అంటే బి.ఏ, డబుల్ ఎం.ఏ.

అసలు కథ పరమ రహస్యం. ఎవరికీ చెప్పకండి. అది నా మొదటి రాత్రి. పెళ్లినడక మెల్లగా ఉంటుంది గానీ శోభనం నడక గురించి తెలీదు. గుడ్డిగా వెళ్ళాను. మొదటి రాత్రి అని మొదట అన్నవాడెవడో గానీ వాడిదంతా బు.త (బుద్ధి తక్కువ). పుట్టినప్పటి నుంచీ ఎన్నో రాత్రులు వస్తుంటాయి. పోతుంటాయి. అది తొలిరాత్రి ఎలా అవుతుంది అంటే ఎవరూ చెప్పరు. మొత్తంమీద పాలగ్లాసుతో గదిలో ప్రవేశించాను. గదిలో అడుగు పెట్టగానే బిత్తరపోయాను. మొగుడుగారు గురకపెడుతూ నిద్రపోతున్నారు. కాగల కార్యం గంధర్వులు తీరుస్తారంటారుగానీ ఇటువంటి విషయాల్లో ఎవ్వరూ ఉపయోగపడరు. స్వయంకృషి తప్ప!

మంచం మీద పక్కన కూర్చుని లేపి కూర్చోపెట్టడానికి నా తల ప్రాణం మొలలోకి వచ్చింది. (తోకలోకి వచ్చిందని అనొచ్చుగానీ నాకు తోక ఎక్కడ చచ్చింది?) ఎంత మొగుడైనా కొత్త కదా! రూల్సు ప్రకారం సిగ్గులు ఒలకపోయాల్సిందే. పాలగ్లాసు ఆయన చేతికిచ్చాను. ఆయన దానిని పక్కన పెట్టారు. అర్ధాంగిని కదా అర్ధభాగం నన్ను తాగమంటారని ఆశపడ్డాను. అయినా ఆడదాని ఆశ అంత తొందరగా ఎలా నెరవేరుతుంది? ఆయన చేత ఎలాగూ నీళ్లు తాగించలేను! కనీసం పాలు అయినా తాగించాల్సిందే అనుకున్నాను.

'ఏమండీ పాలు వేడి తగ్గుతుంది. చల్లబడకముందే తాగండీ' అన్నాను చొరవ తీసుకుని! అప్పుడాయన పాలు 'సుగర్‌లెస్సా' అన్నాడు. 'సారీ! కాదండీ!' అంటే సుగర్‌లెస్ తీసుకురా! అన్నాడు. అప్పుడు నేను 'బెల్లం ఫర్వాలేదుగా' అన్నాను. అప్పుడాయన 'బెల్లం సంగతి కాదు. ...సుగర్‌లెస్ టీ కావాలంతే!' అన్నాడు. వెళ్లి అమ్మను అడిగాను. ఆమె పొయ్యిమీద టీ పెట్టడంతోపాటు కంట తడిపెట్టింది. ఏం చేస్తాను! తాళి కట్టించుకున్న తర్వాత ఖాళీ అయినా ఊరుకోవాల్సిందే. సుగర్‌లెస్ టీ తెచ్చాను... అప్పటికీ ఆయన గ్లాసు తీసుకోలేదు. ఏమిటి సంగతి అన్నారు. నేను ఏమీ మాట్లాడలేదు. మొదటి రాత్రి గురించి నెట్‌లో నిన్నటి నుంచీ కొడుతున్నాను. మ్యాటర్ ఏమీ దొరకలేదు. రాత్రంతా టీలు తాగేసి మేలుకోవడం అన్న పాయింటు ఒక్కటే కనిపించింది అన్నాడు. అప్పటికీ 'మౌనమే నా భాష ఓ మూగమనసా!' అయింది నా పరిస్థితి. నాతో ఉలుకూ పలుకూ లేకుండా సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు. 'సెల్లునయినా కాకపోతిని థ్రిల్లు డ్రిల్లును చేయగా' అన్నట్టయింది. బిజీబిజీగా ఉన్నాడు. సెల్‌లో ఫేస్‌బుక్ ఓపెన్ చేశాడు. శోభనం గదిలో పెళ్లాం ఫేస్ చూడకుండా ఫేస్‌బుక్ చూడడమేమిటని నాకు తెగ చిరాకేసింది. నా ఫ్రెండ్ రిక్వెస్ట్ నువ్వు ఇంకా యాక్సెప్ట్ చెయ్యలేదా అన్నాడు నిలదీసినట్టు. సెర్చ్ అంతటితో పూర్తి కాలేదు. ఇక లైకులు కొట్టేదెప్పుడు ? కామెంట్లు చేసేదెప్పుడు ? అనుభూతులు షేర్ చేసుకునేదెప్పుడు ? దాంతో నాకు మల్లెపూల మత్తు దిగిపోయింది. అయితే ఆయనలో మత్తు లక్షణాలు కనిపించాయి. కొంపదీసి 'బుద్ధి' మంతుడు కాదుగా అన్న అనుమానం వచ్చింది. ఏ దేవుడు కరుణించాడో

పతి దేవుడు ఫోన్ పక్కన పెట్టాడు. 'అమ్మయ్య' అనుకున్నాను. అహమహమికతో ఉన్నాను. ఎలా ఉంటాడో ఏమో అన్న ఆలోచన బుర్ర తొలుస్తోంది. కొన్నాళ్ళ కిందట 'ప్రతి మగాడూ ఇంజనీరే! ఎటొచ్చీ పెళ్లి అయిన కొత్తలో హార్డ్‌వేర్... కొంతకాలం తర్వాత సాఫ్ట్‌వేర్' ... ఆ తర్వాత అంతా 'మెకానికల్' అంటూ నాకు బాగా క్లోజ్ అయిన ఆంటీ అనుభవంతో చెప్పిన విషయం గుర్తొచ్చింది. అప్పుడు ఆ విషయం 'యాంటీనేమో' అనుకున్నాను. ఇప్పుడు అది నిజమేనేమో అనిపిస్తోంది.

ఎలా రాసిపెడితే అలా అవుతుందిలే అనుకున్నాను. అయినా మగాళ్లను నమ్మడానికి వీల్లేదు. మొగుడు గారు అకస్మాత్తుగా లైట్లు తీసేశారు. నాకు అనుమానం ఎక్కువయింది. అతడిలో పారదర్శకత్వం లోపించిందనిపించింది. ఇదేదో కుట్రలాగుంది. నాకు తెలియకుండా ఏదో జరిగిపోతోందనిపించింది. మొదటి రాత్రి రాకుండా మొదటి పగలు అని పెట్టి ఏడవచ్చుగా అని పెద్దాళ్ల మీద పీకల్దాకా కోపం వచ్చింది. అసలే కరెంట్ కట్ రోజులు. ఇన్వర్టర్ లేకపోతే ఇబ్బంది అని ఆలోచిస్తుండగానే పతి దేవుడు నన్ను దగ్గరికి తీసుకున్నాడు. క్షణాల్లో పంపు కొట్టడం మొదలుపెట్టాడు. 'నిన్ను పెళ్లి చేసుకోగానే అలెగ్జాండర్ గొప్ప సింహాసనం ఆక్రమించినప్పుడు ఎంత గర్వపడ్డాడో, నేనూ అంత గర్వపడ్డాను' అన్నాడు. 'ఏమోనండీ' నాకు చరిత్ర తెలియదండీ అన్నాను. అతడు ఆగలేదు. నువ్వు మాట్లాడుతుంటే, ఇందిరాగాంధీ శాసించినట్టుగా ఉంది అన్నాడు. 'ఏమోనండి నాకు రాజకీయాలు తెలియవండీ' అన్నాను. అయినా వదల్లేదు... నువ్వు పాడితే చాలు లతామంగేష్కర్ పాడుతున్నట్టుగా ఉంటుంది' అన్నాడు. దాంతో 'నాకు సంగీతం రాదండీ'

అని స్పష్టం చేశాను. నువ్వు అడుగు తీసి అడుగు వేస్తుంటే ఒక పెద్ద డాన్సర్ డ్యాన్స్ చేస్తున్నట్టుగా ఉంది అన్నాడు. చీకట్లో ఆయనకు కనబడకపోయినా ఏడుపు మొహం పెట్టి 'నాకు డ్యాన్స్ అసలు రాదండీ' అన్నాను. నా జవాబుల తీరు చూసి ఆయన చిరాకు పడ్డట్టున్నారు. కొంపతీసి ఎవరినయినా ప్రేమించావా? అని అడిగాడు. 'నాకు లెక్కలు రావండీ' అన్నాను. అసలే మొగుడు అబద్ధం చెప్పకూడదు కదా! ఆడవాళ్లకు అగ్నిపరీక్షలు పెడతారని తెలుసుగానీ, ఈ భగ్న పరీక్షలేమిటి? అనుకున్నాను. ఆడదానిగా పుట్టడం కన్నా అడవిలో 'మ్యాన్' అయి పుట్టడం మేలు అన్నది ఇందుకేనేమో!

శ్రీవారు దిక్కులు చూసుకుంటున్నట్టు ఉంది. చీకటి కదా నాకేమీ కనిపించలేదు. కళ్లు పొడుచుకున్నట్టు అయినా ఆయన కదలికలు గమనిస్తున్నాను. ఆయన పట్టనట్టు ఉన్నారు. నేను నిద్రపట్టనట్టు ఉన్నాను. చట్టంలాగా గడియారం తనపని తాను చేసుకుంటూ పోతూ ఉంది. అర్ధరాత్రి పన్నెండు, ఒంటిగంట, రెండు గంటలు వరస తప్పకుండా దాటిపోతూ ఉన్నాయి. ఆయన ఆవులింతలు వినిపిస్తున్నాయి. నేను పేగులు లెక్కపెట్టే పనిలో ఉన్నాను. సెగలు పోయాయి. దాని బదులు దిగులు వచ్చింది. తెల్లచీర అలాగే తెల్లగానే ఉంది. తెల్లారిపోయింది. వెలుగుల కోసం రేపు చీకటిపడేంత వరకు ఎదురుచూడ్డమేనా? 'వెలుగులోనుంచి చీకటిలోకి నడిపించు దేవా' అని ప్రార్థిస్తున్నాను. మొదటిరాత్రి మరపురాని రాత్రి అంటారు. ఇది నగ్నసత్యమే. ఎంత మరచిపోదామన్నా జీవితాంతం నేను మరచిపోనిది! మరిచిపోలేనిది! నన్ను మాత్రం మరచిపోకండేం!

'పుత్రికా కామేష్ఠి'

'పుత్రుడు పుట్టేంతవరకు ఫుల్‌స్టాప్ లేదంటూ తొమ్మిది మంది, పదిమంది అమ్మాయిల్ని కన్నవాళ్లను చూశాను. కానీ నువ్వేంటి మరీ విడ్డూరంగా మాట్లాడుతున్నావ్. ఆడపిల్ల పుట్టేదాకా ఆపేది లేదంటూ తొమ్మిదిమంది అబ్బాయిల్ని కన్నావు. ఏంటయ్యా ఈ విపరీతం' అని గడ్డం నిమురుకుంటూ స్వామీజీ అడిగాడు సుబ్బారావుని. ఎలాగైనా స్వామీజీ అనుగ్రహంతో పూజలు, పునస్కారాలు చేసి అయినా 'పుత్రికా పిత'ని అనిపించుకోవాలన్నది సుబ్బారావు సతీసమేతమైన ఉబలాటం! స్వామీజీ కాళ్లు పట్టుకుని ఎంతకీ వదలడం లేదు. స్వామి బుర్ర వెలగక తప్పలేదు. పైగా సుబ్బారావుకు అక్షరాలా, అంకెలారా 72 సంవత్సరాలు. సంతానానికి అనువయిన వయస్సు కూడా కాదని చెప్పినా వినడు. తన వయస్సులో 7, 2 కలిపితే 9 అని, అది లక్కీ నెంబర్ అని సన్నిహితుల దగ్గర వాదిస్తున్నాడు. 'పుడితే పుట్టాలి ఆడపిల్ల, కొడితే కొట్టాలి సిక్సర్' అంటూ వరసగా ముగ్గుర్ని పెళ్లి కూడా చేసుకున్నాడు. దైవానుగ్రహం సరిగా లేక మొదటి ఇద్దరు భార్యలు ఆడపిల్ల తల్లి అనిపించుకోకుండానే గతించారు. ఇప్పుడు మూడో భార్యతో కలిసి పుత్రికా సంతానం కోసం ఎక్కని కొండ లేదు... మొక్కని దేవుడు లేడు. ఇంతలో స్వామీజీ గురించి తెలిసింది. అంతే ఆయన్ను ఆశ్రయించారు.

పుత్రకామేష్ఠిలాగా పుత్రికా కామేష్ఠి జరిపించి అయినా తననొక ఆడపిల్ల కన్నతండ్రిని చెయ్యమని మనసా, వాచా, కర్మణా సుబ్బారావు స్వామీజీని ప్రార్థించాడు. సుబ్బారావు సంగతి ఏమయినా, గాలిలో

వేళ్లు పెట్టి ఏవో లెక్కలు వేసి దయార్ద్ర హృదయంతో సుబ్బారావు వైపు చూసి స్వామీజీ సరే అన్నాడు. సుబ్బారావు చేతివేళ్ల నిండా ఉంగరాలు, మెడలో తులతూగుతున్న గొలుసు, సుబ్బారావు భార్య మెడలో ఉన్న గొలుసులు, సువిశాలమైన నడుముకు ఉన్న బంగారు వడ్డాణం చూసి స్వామీజీకి ముచ్చటేసింది. ఎలాగైనా సుబ్బారావు కోరిక తీర్చాల్సిందేనని కంకణం కట్టుకున్నాడా స్వామీజీ. 'నీవు కోరినట్టు పుత్రికా కామేష్ఠి యాగం చేస్తాను కానీ అందుకు 16 లక్షల 16 వేల 116 రూపాయలు ఖర్చవుతుంది. నీకు సమ్మతమేనా? అడిగాడు..... 'నాకు పైసా అక్కర్లేదు. ఇదంతా మా ట్రస్టుకే' అని కూడా దయతో చెప్పాడు. దాంతో సుబ్బారావు సంతోషిత అంతరంగుడై 'పుట్టేది లక్ష్మి అయినా ఫర్వాలేదు. సరస్వతీ దేవి అయినా ఫర్వాలేదు. కానీండి యాగం' అన్నాడు. యోగం బాగుంటే యాగం ఎందుకు అని కొందరు స్నేహితులు అడ్డుపుల్ల వేసినా వినలేదు. 'కంటే ఆడపిల్లనే కనాలి' అనే దృఢ నిశ్చయానికి వచ్చేశాడు. 'స్వామీజీ! నీవే కలవు' అనుకొని కాలుమీద కాలు వేసుకుని కూర్చున్నాడు.

స్వామీజీ అన్ని ఏర్పాట్లు మొదలు పెట్టాడు. తన ఇంటి ప్రాంగణంలో పుత్రికా కామేష్ఠి యాగం చేద్దామని స్వామీజీ చెప్పాడు. అన్ని ఏర్పాట్లు జరిగాయి. పుత్రికా కామేష్ఠి యాగం జరిగిపోయింది. యాగం ఘనంగా జరిగింది. అయితేనేం దానిని గురించి వార్త గానీ ఒక్క పత్రికలో రాస్తే ఒట్టు. ఒక టి.వి.లో చూపిస్తే ఒట్టు..... భగ్నం చేస్తేనే వార్తా? యజ్ఞం చేస్తే కాదా అని స్వామీజీ దిగులు. యాగానికి పబ్లిసిటీ రాకపోతేనేం సుబ్బారావు భార్యకు గర్భధారణ లక్షణాలు పొడచూపాయి. అంతే ... సుబ్బారావు ఎగిరి గంతేశాడు. 'రావమ్మా మహాలక్ష్మీ రావమ్మా' అని పాట పాడుకుంటున్నాడు. ఆయన అర్ధాంగికి (మూడో భార్య అర్ధాంగి అయితే చనిపోయిన ఇద్దరు భార్యలు ఏ అంగులో అని ఆలోచించి బుర్రలు పాడుచేసుకోనక్కరలేదు. బతికి ఉన్నవాళ్లే లెక్క) నవ మాసాలు నిండాయి. ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరిపోయింది.

మళ్లీ పుట్టిందీ మగబిడ్డే... ఆడబిడ్డ కాదు. సుబ్బారావుకు తిక్కరేగింది. ఆడబిడ్డ పుడుతుందని నమ్మించిన స్వామీజీ గుర్తొచ్చి పళ్లు పటపట కొరికాడు. అయినా స్వామీజీ దయ వల్ల పళ్ళు రాలిపోలేదు. పుత్రికా కామేష్ఠి యాగం కోసం స్వామీజీకి ముట్టచెప్పిన డబ్బు గుర్తొచ్చి ఒళ్లు మండింది. అయినా ఆసుపత్రి పాలు కాలేదు. చేతిలో లక్ష్మి పోయే, కొత్త లక్ష్మి రాకపోయె' అని రగిలిపోయాడు. 'కిమ్ కర్తవ్యం' అని ఆలోచించి స్వామీజీ తనకు చేసిన అన్యాయం గురించి టామ్‌టామ్ చేశాడు. ఛానళ్లకు విషయం చేరవేశాడు. స్వామీజీ మీద ప్రతీకారానికి సమాయత్తమయ్యాడు.

స్వామీజీతో వస్తున్నానని మాటమాత్రమైనా చెప్పకుండా స్వామీజీ దగ్గరికి బయలు దేరాడు. అంతే సిరివెంటన్ లచ్చి అన్నట్టు ఛానళ్ల వాళ్లు, పత్రికల వాళ్ళు సుబ్బారావు అడుగుజాడల్లో స్కూటర్లు, కార్లలో వచ్చేశారు. స్వామీజీని లాల్చీ పట్టుకుని సుబ్బారావు నువ్వు అసలు స్వామివి కాదు. దొంగ స్వామివి! బురిడీ బాబావి. నన్ను నమ్మించావు. ముంచావు! నా డబ్బు అంతా కక్కు. లేకుంటే ఊరుకోను..... నీ బండారం అంతా బయటపెడతా!' అని బెదిరించాడు. స్వామీజీ నోట మాటరాలేదు. టీవీల్లో, పత్రికల్లో ఈ వ్యవహారం పతాక శీర్షికల్లో వచ్చింది. టీవీల్లో చూసిన స్వామీజీ ఆంతరంగికుడు ఆయన దగ్గరికి వచ్చి 'ఏం స్వామీజీ, ఇంతవరకు ఎలా రానిచ్చారు? సుబ్బారావును మేనేజ్ చెయ్యకపోయారా ముందే' అని అడిగాడు. దానికి స్వామీజీ 'ఇప్పుడేమయింది? సుబ్బారావు గొడవంతా నేనే చేయించాను. లేకపోతే టీవీల్లో, పత్రికల్లో ఇంత పబ్లిసిటీ వచ్చేదా! చూశారు కదా! పుత్రికా కామేష్ఠి యాగం చేసినప్పుడు ఒక్క ముక్కయినా పత్రికల్లోనయినా, టీవీల్లోనయినా కనిపించిందా? ఇప్పుడు అన్ని పత్రికల్లో అంతా మనమే. టీవీల్లో మనమే. ఇక చూడు మన డిమాండ్, 'అర్భకులారా మీ చేతిలో ఏమీ లేదు? అంతా నా చేతిలో ఉన్నది' అని స్వామీజీ అభయముద్ర చూపించేసరికి అందరూ అక్కడి నుంచి జారుకున్నారు. స్వామీజీ యథావిధిగా ఇంకో యాగానికి ఏర్పాట్లు చేసుకున్నారు. బకరాయేవ జయతే!

రంభా స్వయంవరం

'ఈ చచ్చినోళ్లతో చచ్చిపోతున్నాను. ఒక్క క్షణం ఖాళీగా ఉండనివ్వడం లేదు. ఆబగా మీదపడిపోతున్నారు. ఒళ్లు హూనమయిపోతోంది. ఎలా బతికేది ? ఒక్క వీక్లీ ఆఫ్ లేదు. కనీసం లంచ్ టైమ్ లేదు... డిన్నర్ టైమ్ లేదు, టీ తాగనివ్వరు, టిఫిన్ తిననివ్వరు. రా అంటే రా అంటున్నారు. పోటాపోటీ! నా కోసం వాళ్లలో వాళ్లకి కొట్లాటలు! వాళ్లకు స్వర్గం సంగతి ఏమోగానీ నాకు మాత్రం నరకమయిపోయింది. ఏం పాపం చేసి చచ్చి ఇక్కడికి వచ్చానో తెలిసిరావడం లేదు. ఇక నేనిక్కడ ఒక్క క్షణం కూడా ఉండను. ఎవడో ఒకణ్ణి కట్టుకుని భూలోకానికి వెళ్లి కాపురం సుబ్బరంగా చేసుకుంటాను. నన్ను వదిలెయ్యండి" అంటూ డామ్ డూమ్ అనేసింది రంభ ఇంద్రుడితో. దాంతో ఇంద్రుడి కాళ్లూ, చేతులూ చల్లబడ్డాయి. "రంభా నీవు లేకపోతే స్వర్గానికి ఏం డిమాండ్ ఉంటుంది ? కాస్త సర్దుకుపో! నీ కోసమేగా వాళ్లంతా ఇక్కడికి వచ్చింది. నీవు వెళ్లిపోతే ఎలా ? కోపం మానుకుని ఇక్కడే ఉండిపో నీకు కావల్సినవన్నీ నేను సమకూరుస్తాను" అని రంభను బతిమిలాడాడు. అయినా రంభ మనసు కరగలేదు. బడాయిలే! నీ ముందు నేనెంత? నువ్వు సహస్రాక్షుడివేగా,చక్కగా వాళ్లతో కాలక్షేపం చెయ్యి' అని నిష్ఠూరమాడింది రంభ. దిక్కుతోచని ఇంద్రుడు ఇంకా పరిపరి విధాలా నచ్చచెప్పిచూశాడు. అయినా ససేమిరా కుదరదంది రంభ.. భూలోకం ఎలా వెళతావు ? ఏం చేస్తావు ? అన్నాడు ఇంద్రుడు.

“ఏముంది? రాఖీ సావంత్‌లాగా నేనూ స్వయంవరం పెట్టుకుంటాను. నాకు ఇష్టమైనవాణ్ని కట్టుకుని భూలోకానికి వెళ్లిపోతాను” అనేసింది. ఇక లాభం లేదనుకుని వెళ్లేటప్పుడు రంభతో గొడవ పెట్టుకోకూడదనుకున్నాడు ఇంద్రుడు. రంభ స్వయంవరం కోసం స్వయంగా ప్రకటన జారీ చేశాడు.

అనాదిగా స్వర్గంలో తన అందచందాలతో అందరినీ అలరిస్తున్న రంభ ఇకముందు పెళ్లి చేసుకుని భూలోకానికి వెళ్లాలనుకుంటున్నది. రంభను చేసుకోదలచిన వ్యక్తి ఎక్కువ పుణ్యాత్ముడై ఉండవలెను. ‘తాపాత్ముడు కాకపోయినా ఫర్వాలేదు అట్టివారి నుంచి తమ తమ వివరాలతో 15 రోజుల్లోగా ఇంద్రభవన్‌కు దరఖాస్తు చేసుకోగలరు. ఎటువంటి పైరవీలు చేయరాదు అని ప్రకటనలో ఉంది.

వేల కొలదీ దరఖాస్తులు వచ్చాయి. అయితే వాటిని వడపోసి, అందులో నలుగురిని ఇంటర్వ్యూకి పిలిచారు. మొదటి వాణ్ని రంభ ఇంటర్వ్యూ చేయడానికని పిలిచింది. నువ్వు ఏం పుణ్యం చేశావేమిటి? అని అడిగింది రంభ. “పెద్ద గుడి కట్టించాను. అంతకన్నా పుణ్యం ఏముంటుంది ? అని చెప్పి రంభ పతి కావచ్చనుకున్నాడు. దరఖాస్తుదారు. చాల్చాలేవయ్యా! గుడి కట్టించానని గొప్పగా చెబుతున్నావు. కుక్కని చంపిన సంగతి దాచేశావు. కుక్కను చంపిన పాపం గుడి కట్టినా పోదు... నీ వరస చూస్తే తెలుగు వాడిలా ఉన్నావు. ఈ సంగతి తెలీదా! ఎళ్లెళ్లు” అన్నది రంభ. అతడు నిష్క్రమించాడు. రెండోవాడు వచ్చాడు. ‘నేను పెద్ద కాలేజీ కట్టించాను. ఎంతోమందికి విద్యాదానం చేశాను. అంతకన్నా పుణ్యం ఏముంటుంది?’ అని రంభకు చెప్పాడు. ‘మా బాబే, కాలేజీ కట్టించావు సరేకాని అందులోని సిబ్బందికి ఏ నెలయినా జీతాలు సకాలంలో ఇచ్చావా ? లేదే! మీ కాలేజీలోనేగా ఓ లెక్చరర్ ఆరోగ్యం బాగాలేక చివరికి తిండికి కూడా లేక ప్రాణాలు పోగొట్టుకున్నాడు,. పోపో! బడాయి చెప్పకు’

అంది. అంతే బతుకు జీవుడా అనుకుంటూ అక్కడినుంచి అభ్యర్థి వెళ్లిపోయాడు. మూడోవాడు ఇంటర్వ్యూకు వచ్చాడు. నేను నా సొంత ఖర్చులతో వంద పెళ్లిళ్ళు చేశాను. అంతకన్నా పుణ్యమేముంది ? అన్నాడు. అది సరేనయ్యా!నీవు పెళ్లి చేసిన వాళ్లలో ముగ్గురమ్మాయిలు వరకట్నం వేధింపుల కారణంగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ పాపమంతా నీదే' అన్నది రంభ. 'అమ్మ బాబోయ్! రంభ మా ఆవిడకన్నా ప్రమాదకరంగా తయారయింది. చిత్రగుప్తుడి అమ్మమ్మలాగా ఉంది. రంభ వద్దు గింభ వద్దు..." అని అతడు గొణుక్కుంటూ స్వర్గంలోని తన క్వార్టర్స్‌కు వెళ్ళిపోయాడు. ఇక నాలుగో వ్యక్తి రంగ ప్రవేశం చేశాడు. 'నేను ఎవ్వరినో తెలుసా? నేను స్వామీజీని, రోజూ కొన్ని వందలమంది భక్తులు వస్తుండేవారు. వారందరి కష్టసుఖాలు విని, వారు కోరిన కోరికలన్నీ తీర్చేవాణ్ని. నువ్వు నా దానివయితే వాళ్ళందరినీ వదిలేసి నీ కోరికలు తీర్చడమే పనిగా పెట్టుకుంటాను' అని రంభను ఊరించాడు. అప్పుడు రంభ 'నీ సంగతి ఎవరికి తెలీదు? నువ్వు భక్తుల పాపపు కోరికలన్నీ తీర్చావు. ఆ పాపం వాళ్లది కాదు నీది. నువ్వేం నాకు అక్కర్లేదు పో' అంది. స్వామీజీ నల్లరంగు వేసుకున్న తెల్లగడ్డం సవరించుకుంటూ అక్కడినుండి వెళ్ళిపోయాడు. అందరూ అయిపోయారా? అని రంభ తన పి.ఏ.ను అడిగింది. అయిపోయారు మేడమ్ అన్నాడు పి.ఏ. అక్కడెవరో తారట్లాడుతున్నారు. ఎవరతను ? అతణ్ని నా దగ్గరికి ప్రవేశపెట్టుము అంది. నిరాశలో కూడా రంభలో చిలిపితనం పొడుచుకువచ్చింది. అతణ్నిచూసి 'ఏమయ్యా ఒక పుణ్యాత్ముణ్ణి పెళ్లి చేసుకోవాలని అనుకున్నాను. ఎవ్వరూ నాకు సరయినవాళ్లు దొరకలేదు. నీవు నాకు నచ్చావయ్యా నా స్వయంవరానికి నీవురాకపోయినా నిన్ను చేసుకోవాలనిపించింది.

నేను రంభను. ఈ స్వర్గంతో విసిగిపోయాను. నాకంటూ ఒక సంసారం కావాలి. తోడు కావాలి. నిన్ను చేసుకుందామని ఉంది అని రంభ అన్నది. నీ వివరాలు ఏమిటో చెప్పు' అని అడిగింది. వాడు

'నువ్వు రంభవైనా నాకు అక్కర్లేదు' అన్నాడు. అదేంటయ్యా చిత్రంగా ఉంది! అందరూ నాకోసమే కదా స్వర్గానికి వస్తారు. నీవేంటీ ఇలా చెబుతున్నావు' అన్నది రంభ. 'రంభగారూ, నేను మీ కోసం రాలేదు. నా పెళ్లాంకోసం వచ్చాను' అన్నాడు. భలే భలేగా ఉంది! పెళ్లాం చనిపోయిన తర్వాత కూడా పెళ్లాన్ని ఇంతగా ప్రేమించేవారు ఉంటారా? అని ఆశ్చర్యంగా ఉంది. నీ వివరాలు చెప్పు వినాలని ఉంది' అని అడిగింది రంభ. 'నేనొక పేద రైతు. నేను మా ఆవిడ ఒకరినొకరు ప్రాణంగా ఉండేవాళ్లం. అందరూ మమ్మల్ని చిలుకా, గోరింక అనేవాళ్లు. మా కాపురం 30 ఏళ్లపాటూ ఆనందంగా గడిచింది. ఉన్నట్టుండి మా ఆవిడకు భయంకరమైన జబ్బు వచ్చింది. దాంతో చనిపోయింది. మా ఆవిడ లేని బతుకెందుకు ? అని దిగులుపడ్డాను. కుంగి కృశించిపోయాను. రాత్రింబగళ్లు అదే ఆలోచన.ఆ దిగులుతోనే ప్రాణాలు విడిచాను. ఇక్కడికొచ్చాక ఇది స్వర్గమని తెలిసింది. మా ఆవిడ ఎక్కడయినా కనిపిస్తుందా అని వెతుకుతున్నాను. ఇక్కడ ఏదో సందడిగా ఉంటే కొంత మనశ్శాంతి వస్తుందేమోనని ఇక్కడ కూర్చున్నాను' అన్నాడు. దాంతో రంభ 'నేను ఎంతమందిని సంతోషపెట్టినా నన్ను పెళ్లిచేసుకుంటానని ఎవ్వరూ ముందుకు రాలేదు. భార్యను అపురూపంగా చూసుకుని, చనిపోయినా ప్రేమించే నువ్వే గొప్ప పుణ్యాత్ముడివి. నేను నిన్ను ప్రేమిస్తున్నాను, నిన్ను పెళ్లి చేసుకుంటాను అంది రంభ. అక్కర్లేదు... నువ్వు అక్కర్లేదు... నా భార్యే నాకు రంభ' అన్నాడు. "కాదు నాతో నువ్వు సంసారం చేయకపోయినా ఫర్వాలేదు... నువ్వే నా మొగుడివి! నీకు నేనే తాళికడుతున్నాను. నీ భార్యను నేను వెతికి తెచ్చి ఇస్తాను.." అంటూ రంభ ఆ పనిమీద బయలుదేరింది.

రైతు తన భార్య కోసం అలా ఎదురుచూస్తూ కూర్చునే ఉండి పోయాడు.

అసలు నరకం

'యమధర్మరాజు డౌన్‌డౌన్
చిత్రగుప్తుడు డౌన్‌డౌన్
నరకవాసుల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ

యమధర్మరాజు సౌధం ముందు నినాదాలు హోరెత్తుతున్నాయి. నరకవాసుల సంఘం (నవాసం) ఆధ్వర్యంలో ధర్నా జరుగుతోంది. నరకవాసులను ఉద్దేశించి ఆ సంఘం అధ్యక్షుడు పుణ్యమూర్తి ప్రసంగిస్తున్నాడు. 'సోదరులారా! ఎంత అన్యాయం! మనల్ని హింసించడానికి మొత్తం 84 వేల నరకాలున్నాయి. అందులో ఏడు మహా నరకాలంట! మన ఐక్యతను దెబ్బతీయడానికి ఇన్ని నరకాలను పెట్టారు. ఎన్ని రకాల శిక్షలు! మనల్ని ముక్కలు ముక్కలు చేసి సలసల కాగే చమురులో వేసి హింసిస్తున్నారు. ఇంకా ఎన్నెన్నో చిత్రహింసలు. తలుచుకున్న మానసిక హింసే!

అసలు ఈ హింసలేంటి? ఈ శిక్షలు ఏమిటి ? కాలంతో పాటు నరకాలూ మారాలి! మనం చేసిన తప్పులకు ఇళ్లల్లోనో, జైళ్లలోనో శిక్షలు అనుభవించాం కదా! మళ్లీ ఇవేంటి ? ఒక తప్పుకు రెండు శిక్షలేంటసలు? నరకంలోని శిక్షలు చూస్తుంటే ఎంత ఘోరంగా ఉన్నాయి? వీటిలో ధర్మం ఏమయినా ఉందా ? యమా... ధర్మరాజా! చిత్రగుప్తుడు ఎన్ని తప్పుడు లెక్కలు రాసినా, అతగాడికి శిక్ష ఏమీ ఉండదా? మీ చిత్రగుప్తుణ్ణి తక్షణం సస్పెండ్ చేసి, ఆయన మీద సి.బి.ఐ. దర్యాప్తు జరపడం మంచిది. నరకంలో మేం ఎంతకాలం శిక్ష

అనుభవించినా మీకు దయా, జాలి ఏమీ ఉండవా? భూమ్మీద కారాగారాల్లో ఖైదీలకు పెరోల్ ఇస్తారు గదా! నరకంలో ఎందుకు ఇవ్వరు? మా ఇళ్లలో వాళ్లతో మేం మాట్లాడుకోవద్దా! నరకం నుంచీ మా ఇళ్లకు ఫ్రీగా మాట్లాడుకోవడానికి బిల్లు లేకుండా ఉండేలా సి.యు.జి. ఫోన్ ఇవ్వాలి. వైఫై కూడా ఉండాలి. ఇక్కడ కూడా పెరోల్ ఇవ్వాలన్నదే మా డిమాండ్.

"చిత్రగుప్తా! ఒకసారి భారతదేశంలోని జైళ్లు చూసిరా! నీకు తెలుసొస్తుంది. అక్కడి జైళ్లలో చక్కగా మొబైల్ ఫోన్లు ఇస్తారు. మందు బాటిళ్లు ఇస్తారు. ఏసీ సౌకర్యమూ ఉంటుంది. చికెన్, మటన్ అన్నీ పెడతారు. అంతకంటే మీరేమన్నా గొప్పవాళ్లా? ఇలా చేస్తుంటే నరకానికి ఎవరు వస్తారు ? మీ భవిష్యత్తు కోసమే చెబుతున్నాం. మీ కళ్లల్లో ఆనందం కోసమే చెబుతున్నాం! ఒక్కరోజు జైల్లో ఉన్నా అది మధుర స్మృతిలా ఉండాలి. ఇప్పటికైనా నరకంలో సంస్కరణలు మొదలుపెట్టాలి. లేకపోతే జరగబోయే పరిణామాలకు మీరే బాధ్యులు. ముల్లును ముల్లుతోనే తీస్తాం" అని పుణ్యమూర్తి నరకంలో పెద్దల్ని హెచ్చరించేశారు. దాంతో యమధర్మరాజు మనస్సులో కాస్త కంగారు పుట్టింది. చిత్రగుప్తుణ్ని పిలిచి కొన్ని విషయాలను రహస్యంగా చర్చించారు. చిత్రగుప్తుడి సలహా ప్రకారం నరకవాసుల సంఘం ప్రతినిధులను చర్చలకు పిలిచారు. వీళ్లేమో తమ డిమాండ్ల మీద గట్టిగా నిలబడ్డారు. ఎక్కడోచోట రాజీపడాలి కదా! యమధర్మరాజుకు ఓ ఐడియా వచ్చింది. ఒక ఐడియా జీవితాన్నే మారుస్తుంది అంటారు కదా! అంతే! మీరంతా ఆరు నెలలపాటు పెరోల్‌మీద ఇళ్లకు వెళ్లండి. మేమూ కొంతకాలం విశ్రాంతి తీసుకుంటాం' అని యముడు చెప్పాడు. నరకవాసుల సంఘం ప్రతినిధులు 'భలే భలే' అన్నారు. అందరూ ఆగమేఘాలమీద రాగాలు తీస్తూ భూలోకంలోకి చేరిపోయారు. ఎవరి ఇళ్లకు వాళ్ళుచేరుకున్నారు. అందరికన్నా ముందు నవాసం అధ్యక్షుడు పుణ్యమూర్తి మీసాలు దువ్వుకుంటూ సగర్వంగా

ఇంట్లోకి అడుగుపెట్టాడు. ముందు అతడి భార్య చూసింది. 'నేను నరకం నుండి తిరిగి వచ్చేశానోచ్' అని అతడు ఆనందంగా కేకలేశాడు. ఇది కలా? నిజమా? అన్న అనుమానం ఆమెకు కలిగింది. గిచ్చుకొని చూసింది. నిజమే! అంతే ఆమెకు పిచ్చికోపం వచ్చేసింది. పైశాచిక భాషలో రెచ్చిపోయింది. 'సచ్చినోడా! మళ్లీ ఎందుకు వచ్చావు ? నువ్వు స్వర్గానికి వెళ్లావని నలుగురికీ గొప్పగా చెప్పాను. నరకానికి వెళ్ళి మా పరువు తీసేశావు. పోయినోడివి ఎటూ పోయావు! ఈసారయినా కాస్త మంచివాణ్ణి చూసి చేసుకుందామని ఏర్పాట్లు చేసుకుంటున్నాను. సరిగ్గా ఇదే టైములో ఎందుకు తగలబడ్డావు ? అసలు నిన్ను నరకానికి ఎందుకు తీసుకెళ్లారు ? నాకు తెలీకుండా ఏం తప్పులు చేశావ్? నాకు తెలీకుండా ఎవరితో కులికావ్. చెప్పు! లేదంటే నీ తోలు తీస్తా' అని వీరలెవెల్లో విశ్వరూపం చూపించింది. అంతలోనే కొడుకు వచ్చాడు. తండ్రిని చూసి బాధతో అతడి దుఃఖం ఆగలేదు. 'నాన్నా, నువ్వు చచ్చావని నీ ఉద్యోగం నాకు ఇచ్చారు. నా ఉద్యోగం పోతుంది. ఇక నేనెలా చావాలి?' అన్నాడు కుమిలిపోతూ.

ఇంతలో కూతురు వచ్చింది. "నరకం నుంచి పెరోల్ మీదొచ్చి, ఇలా గుండ్రాయిలా నట్టింట్లో తిరుగుతూంటే రేపు నన్నెవరు చేసుకుంటారు?" అని ముక్కుచీదింది. దాంతో పుణ్యమూర్తికి బుర్ర గిర్రున తిరిగింది. అది అలా తిరుగుతూ తిరుగుతూ ఉండగానే పిడుగులా వచ్చి పడింది పనిమనిషి. చూస్తే చేతిలో చీపురుకట్టతో కన్యాశుల్కంలో పూటకూళ్లమ్మలాగాఉంది. పుణ్యమూర్తిని చూడగానే విషయం తెలిసినట్టుంది. అగ్గిమీద గుగ్గిలమయిపోయింది. "ఏమయ్యా! 'అమ్మగారు ఊళ్లో లేనప్పుడు నన్ను దగ్గరికి తీసుకుని పట్టుచీర కొనిస్తానన్నావు.

అదన్నావు. ఇదన్నావు. ఏవేవో చెప్పి ఊరించావు. చెప్పా పెట్టకుండా చచ్చి కూర్చున్నావు. నేను అన్యాయమైపోయాను' అని మెటికలు విరిచింది. అందరూ సహాయ నిరాకరణ మొదలుపెట్టారు. చేతిలో పైసా లేదు. ఆస్తులన్నీ ఇంట్లోవారి పరమైపోయాయి.

తిండి తిప్పలు లేవు. తినడానికి తిట్లు తప్ప అట్లు దొరకడం లేదు. కాలం గాయాలను మాన్పుతుంది అనుకున్నాడు. కానీ అది జరగకపోగా పరిస్థితి నానాటికి తీసికట్టు అవుతోంది. క్షణమొక యుగమై పోయింది. కళ్లు తేలేస్తూ క్యాలెండర్ చూసేసరికి వారం దాటిపోయింది. నా బతుకే ఇట్లా ఉందా ? నరకంలో నుంచి వచ్చిన మిగిలిన వాళ్ళ పరిస్థితి కూడా ఇలాగే ఉందా? అని కనుక్కుందామనుకున్నాడు. అందరికీ ఫోన్లు చేశాడు. దాదాపు అందరిదీ ఇదే అవస్థ. పేర్లు మాత్రమే మార్పు. నరకంలో నుంచి ఇళ్లకి వచ్చి పెద్ద పొరపాటయిందన్నారు. పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు ఉందన్నారు. మన ఇళ్లే అసలు సిసలు నరకాలని అందరూ ఏకగ్రీవ అభిప్రాయానికి వచ్చారు. ఆ నరకమే మేలు అన్నారు. "పెరోల్ రద్దు చేసుకుని వెంటనే తిరిగి నరకానికి వెళ్లిపోదాం. 'యమధర్మరాజుతో మాట్లాడండి అర్జంటుగా' అన్నారు. పుణ్యమూర్తి యముడికి ఫోన్ చేశాడు. అందరి తరపున మాట్లాడాడు. యమధర్మరాజుకు సారీ చెప్పాడు. 'మళ్లీ నరకానికి వస్తాం సార్, మీరు ఏ శిక్షలు వేసినా హ్యాపీగా భరిస్తాం సార్" అంటూ యముడికి స్తోత్ర పాఠాలు చదివాడు. యముడు అమందానంద కందళిత హృదయార విందుడయ్యాడు. నరకానికి స్వాగతం పలికాడు. గతం గురించి ఆలోచించవద్దన్నాడు. నిజమైన నరకం నుంచి మామూలు నరకానికి సంబరంగా బయలు దేరారు! అందరూ వెనక్కి చూడకుండా ఛలో నరకమనుకుంటూ వెళ్లిపోయారు.

సంఘీభావం

అంతా కలకలం, నరాలు తెగే ఉత్కంఠ. ఏమవుతుందోనన్న భయం. అది జంతు ప్రదర్శన శాల. అందులోని సందర్శకులందరూ అక్కడ గుమికూడారు. అలా ఎలా జరిగింది ? అనేవాళ్ళు కొందరు. అయ్యో పాపం అనేవాళ్లు మరికొందరు. ఎలాగయినా అతడు బతికితే బాగుండు అనుకుంటున్నారు.

అందరి చూపు దానిమీద ఉంది. ఏం చేస్తే అతణ్ణి రక్షించగలం అనుకుంటూ సిబ్బంది ఉరుకులూ పరుగుల మీద ఉన్నారు. అసలు కథ ఏమిటి ? అక్కడ సింహాల ఎన్‌క్లోజర్ ఉంది. ఒక విజిటర్ అందులోకి అకస్మాత్తుగా దూకేశాడు. ఇది ప్రమాదవశాత్తూ జరిగింది కాదు..... అతడు కావాలనే దూకేశాడు. అక్కడొక సింహం ఉంది. ఇతగాడు సింహాన్ని చూసి భయపడలేదు. జీవితంలో మొదటిసారి మీసాలు దువ్వాడు. పెళ్లయ్యాక భార్యముందు కూడా మీసం మీద చెయ్యేసి ఎరుగడు. అయితేనేం సింహాన్ని చూసేటప్పటికి అతడికి ప్రాణం లేచొచ్చినట్టయింది. దానికి షేక్‌హ్యాండ్ ఇవ్వాలనిపించింది. చేయిజాచాడు. సింహం ముందుకొచ్చింది. సాహసవీరుడు వెనక్కి తగ్గలేదు. మగ సింహం ఇంకాస్త ముందుకొచ్చింది. అతణ్ని చూసింది. కాసేపు అలా ఆగిపోయి చూస్తూ చూస్తూ ఏదో ఆలోచిస్తూ ఉండిపోయింది. ఈ లోపల సిబ్బంది అతణ్ణి ఏదోవిధంగా రక్షించడానికి తంటాలు పడుతున్నారు.

ముందుకు వస్తున్న సింహం ఒక్కసారి ఆగిపోయింది. కొద్దిసేపటికి తర్వాత వెనక్కి వెళ్ళిపోయింది. అలా ఎందుకు జరిగింది ? అది క్రూర జంతువే! అయితేనేం దాని ముఖంలో రంగులు మారాయి. ఒక్కసారి అది ఏడుపు లంకించుకుంది. అది ఏదో భాషలో గొణుక్కుంటూ ఉంది. అది 'సింహ'ళ భాష అయి ఉంటుందని భాషా నిపుణులు అంచనా వేశారు. ఆ సింహం ఎందుకు అలా చేసింది ? చంపకుండా ఎందుకు వదిలేసింది? దాని అంతర్మథనం ఏమిటి ? అంతా పూసగుచ్చి చెప్పినట్టు చెప్పేశారు. ఏంటి కథ! అదే తమాషా! అది దాని ఆత్మకథ. అది మగ సింహం.ఆడ సింహంతో ఎన్ని అవస్థలు పడుతున్నాను! అది నన్ను ఎంత చంపుకుతింటోంది!

ఇతగాడి మొహం చూస్తే జాలేస్తుంది. భార్యవల్ల ఎన్ని ఇబ్బందులు పడుతున్నాడో ఏమో. లేకపోతే ఇంత దుస్సాహసం ఎందుకు చేస్తాడు? అందువల్ల ఇతణ్ని వదిలెయ్యాల్సిందే. అందుకే వదిలేస్తున్నాను. అవసరమైతే ఇతడి ఇంటికైనా వెళ్లి అతడి భార్య బారి నుంచి రక్షించాల్సిందే' అనుకుందట! అంతే వెనక్కి తిరిగి వెళ్లిపోయిందట. ఈ విషయం ఆడ సింహానికి తెలీకుండా జాగ్రత్తపడుతోంది.

ఈ కథ అలా పక్కన పెడితే సింహం ఎన్‌క్లోజర్ నుంచి దుస్సాహసుణ్ని బయటికి రప్పించారు. పోలీసులు ఏం జరిగినా 'విచారిస్తారు కదా! అలాగు వాళ్లు విచారిస్తూ.. విచారిస్తూ తనను బంధించినా, నిందించినా అతగాడికి చీమకుట్టినట్టయినా లేదు. 'ఎందుకు ఇలా చేశావ్' అని పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించారు. ఏముంది ? మా ఆవిడ కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక అలా చేశాను' అన్నాడు. అదేమిటయ్యా దెబ్బలు ఎక్కడ తగిలాయి? చూపించమని

పోలీసులు దబాయించి అడిగారు. 'అవీ పోలీసు దెబ్బలు లాంటివే'నని నవ్వాడు. అప్పుడు పోలీసు సింహాలూ మన పరిస్థితీ ఇంతేగా అని బయటికి వినపడకుండా నవ్వుకున్నారు. పోలీసు దెబ్బలకు బ్రహ్మలు ఇంట్లోని అమ్మలు కదా అనుకొని పడీపడీ నవ్వుకున్నారు. ఏడవలేక నవ్వడమంటే అదేననీ వారికి అర్థమయింది.

పోలీసులకు ఒక చిక్కుముడి విడిపోయింది. ఇతగాడు సింహాల ఎన్క్లోజర్‌లో ఎందుకు దూకాడో అర్థమయింది. సింహం ఇతగాణ్ని ఎందుకు వదిలేసిందో కూడా బయటపడింది. కార్ల్‌మార్క్స్ మగాడయ్యి ఉండి కూడా సాటి మగాళ్ల కష్టాలు గమనించలేకపోయాడు. ప్రపంచ మగాళ్లారా! ఏకం కండి! పోరాడితే పోయేది పోలీసు దెబ్బలే' అన్నట్టు వాళ్లకు అర్థమయింది.

చుట్టూ చేరిన మగాళ్లంతా 'ఆహా! సింహం! అన్నారు. పూర్వ జన్మలో అది మగాడయి ఉంటుందనుకున్నారు. మగజాతి ఐక్యత వర్థిల్లాలి అన్నారు. అందరిలోనూ ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. ఎవరి భార్య కనపడ్డదో ఏమో తెలీదు! అందరూ ముక్కూ, నోరు మూసుకున్నారు. ఎవరి 'జైలు'కు వారు వెళ్లిపోయారు. అచ్చు తప్పు జైలు కాదు ఇల్లు!

డబుల్ ట్రబుల్

'ముగ్గు వేశాను' పూజ చేయాలి... తొందరగా రండి. మీ ఇంట్లో అన్నింటికన్నా విలువయినవి పట్టుకురండి. ముగ్గులో పెట్టండి అవి డబుల్ అవుతాయి. ఇదిగో కుబేరుడి బొమ్మ పెట్టాను. అదిగో లక్ష్మీ దేవి బొమ్మ పెట్టాను. ఈ 'బొమ్మల సాక్షి' అని డబుల్ బాబా కేకేస్తున్నాడు. భూదేవి అంతపీట, ఆకాశమంత పందిరి వెయ్యకపోతేనేం... బయటికి కనిపించకపోతేనేం ఎంత హడావుడి! ఎంత ఉత్కంఠ! సాక్షాత్తు లక్ష్మీదేవి వచ్చినా ఇంత హడావుడి ఉండదు. 'ఏమ్మా! కొద్దిసేపు నాకు కాస్తపని ఉంది. గదిలో ఉంటాను. విలువయిన వస్తువులు పెట్టండి.. నేను వచ్చేస్తాను. క్షణాల్లో లక్ష్మీ సాక్షాత్కారం... మంచి తరుణం మించిన దొరకదు' అని ఊరించి, ఊరించి ఇల్లాల్ని ముగ్గు ముందు కూర్చోబెట్టాడు. విలువైనవి తీసుకురండి.. తీసుకురండి.. అని శ్రీవారికి హుకుం జారీచేసింది. అంతే... ఆయన ఇంట్లో ఎక్కడెక్కడో పెట్టి చూసి నోట్ల కట్టలు తెచ్చిపెట్టాడు. అది చూసి ఆమెకు మండింది. డబ్బంటే పడిచస్తారు. మీ అమ్మ సంగతి కూడా ఇంతేగా! పనికిమాలిన డబ్బు వల్ల మనుషుల పరువు పోతుంది. వెంటనే ఈ నోట్ల కట్టల్ని మర్యాదగా తీసుకు వెళ్లండి' అనేసింది. దాంతో ఆయన లెక్కపెట్టిన నోట్లకట్టలన్నీ తెచ్చి పెట్టిన ఆయన అట్లాగే వెనక్కి తీసుకువెళ్లాడు. అమ్మగారు మళ్లీ కేకలు వేశారు 'తొందరగా తీసుకురండి' అని, అయ్యగారు ఇంకా

విలువయినవి ఏమిటా అని తలమీద ఉన్న నాలుగు వెంట్రుకలకూ ఎటువంటి ముప్పూ రాకుండా బుర్ర గోక్కున్నాడు. ఐడియా తట్టేసింది. వెంటనే బీరువాలో ఉన్న అభరణాలన్నీ తీసి ఒక హ్యాండ్‌బ్యాగులో పెట్టి తెచ్చి భార్యకు చూపించాడు. బంగారం కదా అప్పీలు లేదు అనుకొని భార్యముందు మొదటిసారిగా తలెత్తుకుని నిలబడ్డాడు. అయినా దేవుడు కరుణించలేదు. ఆయన తలదించుకోక తప్పలేదు. ఇల్లాలు కలకత్తా కాళిక అవతారమెత్తింది. పతిదేవుడి ప్రాణం తీయకపోవడం ఒక్కటే తక్కువ.

తెలివి తక్కువ దద్దమ్మ! నీకిచ్చి మా నాన్న నా గొంతు కోశాడు. బంగారమే గొప్ప విలువయిందా ? బంగారాన్ని ఏమయినా కోసుకు తింటామా? నీకు విలువయినవేమిటో తెలిస్తే నా బతుకు ఇట్లా ఎందుకు తగలబడుతుంది!' అని నిప్పులు చెరిగేసింది. ఇంకోటి తీసుకురండి అని 'ఆడనెన్సు' (ఆర్డినెన్సు ప్రకృతి, అడనెన్సు వికృతి) జారీ చేసింది. ఆయనకు ఆ దెబ్బకు కాళ్లూ చేతులు వణికాయి. టాయిలెట్‌కి వెళ్లిరావడం అత్యంత విలువయిన అవసరం అయింది. వెళ్లి వచ్చాక ఒక్క నిముషం మనస్సులో స్వర్గ సంతోషాన్ని అనుభవించేశాడు. ఈ జన్మకు ఇది చాలులే. అనుకున్నాడు. అంతలోనే భార్య వేసిన పెద్ద కేకకు కర్ణబేరి పగిలిపోయే స్థితికి వచ్చింది. విషయం అర్థమయింది. ఇంట్లో ఉన్న ఎప్పుడో కొన్న డైమండ్ రింగ్ గురించి గుర్తొచ్చింది. 'బతికిపోయాను' అనుకున్నాడు. ఓపిక లేకపోయినా తెచ్చి భార్య చేతిలో పెట్టాడు. 'మీ మైండ్ మండ! డైమండ్ గొప్పదనుకుంటున్నావా! వయస్సు వచ్చింది గానీ బుద్ధి రాలేదు... వెళ్లండి వెళ్లండి... నిజంగా విలువయినదేదో ఆలోచించుకోండి' అని తిరుగులేని అరుపు అరిచింది.

పతిదేవుడు ఏం చేయాలో లక్కు తోచక ఇంట్లోకి పరుగు తీశాడు. డబుల్ బాబా మహాశయుడు ముగ్గు దగ్గరికి వచ్చేశాడు. పూజ చేయడానికి సిద్ధమయ్యాడు. అమ్మా విలువైనవి ఇంకా తేలేదా! అని అడిగాడు. మేము బయటకు చూపించలేం మనస్సులో అనుకుంటాం అంది. పూజ మొదలు పెట్టేశాడు. 'మీరు పేపర్లు చదువుతుంటారా? టీవీలు చూస్తుంటారా?' అని అడిగాడా బాబా. చూస్తుంటాంలే... కానివ్వండి పూజ అని ఇల్లాలు అనేసింది. 'ఏంటీ మొగుణ్ని బెదిరించినట్టు నన్ను బెదిరిస్తుంది!' అని బాబా అనుకున్నాడు. డామిట్ కథ అడ్డం తిరిగింది అన్న డైలాగ్ గుర్తొచ్చింది. 'జై గిరీశం' అనుకున్నాడు. అమ్మా కాస్త ముందుకు జరగండి... పూజ ప్రారంభిస్తాను. మీరు కళ్లు మూసుకోండి. అయిదు నిమిషాల తర్వాత తెరవండి అనేశాడు. అనడమే ఆలస్యం అమ్మగారు ముగ్గు'లోకి వచ్చేశారు. పూజ షురూ అయ్యింది. ఎందుకయినా మంచిదని అయ్యగారు ఇంట్లోనే తలదాచుకున్నారు. నిమిషమో యుగంగా గడిచింది. ఐదు యుగాలు గడిచాయి. రెండు ఆడ గొంతులు గట్టిగా వినిపించాయి. ఇంట్లో ఉన్నది తన భార్య ఒక్కతే కానీ రెండు ఆడ గొంతులు ఎలా వినిపిస్తున్నాయి అని ఇంటాయన పూజ గదిలోకి వచ్చేశాడు. తన భార్యతో పాటు ఇంకో ఆడమనిషి కనిపించింది. ఇదేమి చోద్యం... అనుకున్నాడు.

ఇద్దరు ఆడవాళ్లు భీకరాకారంలో కనిపిస్తున్నారు. నువ్వు ఎవ్వతెవె నా ఇంట్లోకొచ్చావు. నా కొంప కూల్చడానికి వచ్చినట్టున్నావ్! గెటవుట్ అన్నది ఇల్లాలు. మాటలు జాగ్రత్తగా రానియ్! పళ్లు రాల్తాయ్! ఈ ఇంట్లో నీకు ఎన్ని హక్కులు ఉన్నాయో నాకు అంతకంటే ఎక్కువ హక్కులే ఉన్నాయ్... నీ మొగుడు ఇక నా మొగుడు. నేను ఆయనకు 'అసలు

సిసలు భార్యను' అనేసింది కొత్తావిడ. ఇలా 'వాగు'యుద్ధం నిరాఘాటంగా సాగుతోంది. ఇంట్లోని పళ్లాలు కూడా ఆయుధాలు అయ్యాయి. మూడో ప్రపంచ యుద్ధం అంటే ఏమిటో ఇంటాయనకు అర్థమయింది. ఇద్దరు ఆడవాళ్లు ఒకరి జుట్టు ఇంకొకరి చేతుల్లోకి తీసుకున్నారు. దానిని ఎంతటికీ వదిలెయ్యడం లేదు. వారిద్దరినీ విడదీసే సాహసం ఇంటాయన చెయ్యలేకపోతున్నాడు. 'ఎవ్వనిచే జనించె ఈ గొడవ ఎవని లోపల నుండు లీనమై' అని పద్యం చదువుకున్నాడు. ఇద్దరు భార్యల ముందు ఈశ్వరుని శరణు వేడుకున్నాడు. కళ్ల ముందు నిలువెత్తు బాబా నిలుచున్నాడు. వెళ్లి బాబా జుట్టు పట్టుకున్నాడు. ఒక పెళ్లాంతోనే వేగలేక చస్తుంటే ఇంకొకరిని తెచ్చి పెట్టావేంటయ్యా! చేతనైతే నా పెళ్లాన్ని మాయం చెయ్యి. లేకపోతే నీవు తెచ్చినావిడను అయినా కనిపించకుండా చెయ్యి. లేకపోతే నిన్ను పీక పిసికి చంపేస్తాను' అని బెదిరించేశాడు. అంతే! ఒక్క క్షణంలో బాబా పత్తా లేడు. ఆయన 'సృష్టించిన' ఆవిడా కనిపించలేదు! ఇంటావిడ విశ్వరూపం ప్రదర్శిస్తూ కనిపించింది. 'పిచ్చివాడా! ఇప్పటికైనా తెలుసుకో! ఈ ఇంట్లో నాకన్నా విలువైన శక్తి ఏదీ లేదు' అని ఆవిడ శరీరవాణి పలికింది. ఇంటావిడ విశ్వరూపాన్ని శాంతింపజేసేసరికి ఇంటాయనకు తల ప్రాణం తోకలోకి వచ్చేసింది. తోక ఊపుకుంటూ బెడ్‌రూంలోకి వెళ్లిపోయాడు. కథ మాత్రం కంచికి పోయింది.

కేవలం స్వర్గీయ

'ఇంద్రుడు ఈగలు తోలుకుంటున్నాడు. రంభ పనీ పాట లేక దొర్లాడుతోంది. తిలోత్తమ, ఊర్వశి లాంటి వాళ్లదీ ఇదే పరిస్థితి. తుపాకీ గుండుకు కూడా స్వర్గస్థులు ఎవ్వరూ దొరకడం లేదు. పీపాలకు పీపాలు సురపెట్టినా తాగడానికి దిక్కు లేదు. స్వర్గంలోకి కొత్తగా ఎవ్వరూ రావడం లేదు. పాత వాళ్లు మాయమయ్యారు. పునర్జన్మలు ఎత్తుతున్నారు. ఇక ఎవ్వరి మీద పెత్తనం చేయాలి...? ఇదే ఇంద్రుడి దిగులు. ఎందుకు స్వర్గం ఖాళీ అవుతోంది? స్వర్గానికి వెనకటి కళ రావాలంటే ఏం చేయాలి!

మరోవైపు నరకం కళకళలాడుతోంది. ఇదేమి వింత! స్వర్గంలో కటకట ఇక్కడ కిటకిట! తిక్క రేగుతోంది. నరకంలో ఉన్నవాళ్లు తమ ఇళ్లలో వారితో మాట్లాడుకోవడానికి సెల్‌ఫోన్ ఇచ్చారు. ఫోన్లు ఇవ్వగానే సంబరం కాదు. బిల్లు ఎలా కట్టాలి? ఎక్కడ కట్టాలి? అని నిలదీశాడు. దాంతో యమధర్మరాజు కరుణాంతరంగుడై మీ ఇంట్లో వాళ్లతో ఎంతసేపయినా మాట్లాడుకోండి... హెల్ టు హెల్ ఫ్రీ అనేశారు. దాంతో నరకస్థులు బాధపడ్డ పాపాన లేదు.

ఎవ్వరూ పుణ్యం చేయడం లేదా! పుణ్యం చేసిన వాళ్లు స్వర్గానికి రావడం లేదా? చిత్రగుప్తుడు ఏమయినా రాజకీయం చేస్తున్నాడా? ఇవన్నీ ఇంద్రుడి బుర్రను తొలిచేస్తున్న సమస్యలు. ఎవ్వరూ రావడం లేదా? మనిషి శవానికి ఇంకా దహనక్రియలు చేయకముందే అతడి బంధుమిత్రులంతా అతడు స్వర్గస్థుడయ్యాడని టముకు వేస్తున్నారు.

మా తండ్రి స్వర్గస్థుడయ్యాడని చెప్పడానికి చింతిస్తున్నాం అని మెసేజ్‌లు ఇస్తారు. వాళ్ల మొహం! పెద్దలు స్వర్గస్థులయితే సంతోషించాలి గానీ ఈ పితలాటకం ఏమిటి ? ఈ చచ్చే చావు ఎందుకు వస్తోంది ? చావబట్టే కదా! చచ్చినవాళ్లలో ఎవరు పుణ్యాత్ములో ? ఎవరు పాపాత్ములో? సరిగా తెలిసి చావడం లేదు. స్వర్గం మళ్లీ కళకళలాడెదెట్లా? నరకం మీద భారం తగ్గేదెట్లా ? సమస్య పరిష్కారానికి మార్గం ఎలా ? అన్నది పెద్ద సమస్య అయింది. స్వర్గాధిపతి ఇంద్రుడు, నరకాధిపతి యమధర్మరాజు సమావేశమయ్యారు. నా పరిస్థితి దయనీయంగా ఉంది. నీవంటే ఎప్పుడూ జనసందోహంలో ఉంటున్నావు. నరకంలో ఉన్నా నీకు హ్యాపీగా ఉంది. నాకు స్వర్గంలో ఉన్నా మనశ్శాంతి లేదు. ఏమి చేయమంటావు యమధర్మరాజా! అన్నాడు ఇంద్రుడు. అప్పుడు యమధర్మరాజు పకపకా నవ్వాడు. సాక్ష్యం కోసం సెల్ఫీ కూడా తీసుకున్నాడు. "ఏమిటయ్యా నా పరిస్థితి. నీకు నవ్వులాటగా ఉందా?'' అని ఇంద్రుడు అన్నాడు. అప్పుడు యమధర్మరాజు నిశితంగా చూస్తూ 'ఏదోలె అని నిన్ను చూసీ చూడకుండా వదిలేస్తున్నాం. నీ స్వార్థం కోసం ఇంత పదవిని కాపాడుకోవడానికి ఎంతమంది మునుల తపస్సులను చెడగొట్టావు. ఈ పనిలోకి రంభా, ఊర్వశి, మేనకలాంటి వాళ్లను ఉపయోగించి అధికార దుర్వినియోగం చేస్తుంటావు. నీవు ఎంత మంది ఆడవాళ్లను చెరబట్టావు. నీ భాగోతం అందరికీ తెలుసు. నీకు సహస్రాక్షుడు అనే పేరు ఎందుకు వచ్చిందో ఎవరికి తెలీదు? నరకంలో శిక్ష అనుభవించాల్సిన వాళ్లలో మొదటివాడివి నువ్వే' అన్నాడు. దాంతో ఇంద్రుడు 'ఇదేం అన్యాయం' అంటూ లబలబలాడాడు. 'పోనీ నేను ఇంతకాలం నరకంలో ఉండి అలసిపోయాను. నేను స్వర్గానికి అధిపతిగా ఉంటాను. నువ్వు నరకానికి అధిపతిగా ఉండు. నేను, చిత్రగుప్తుడు స్వర్గానికి వచ్చేసి హ్యాపీగా ఉంటాం. చిత్రగుప్తుడు ఇంతకాలం పాపాలు

లెక్కిస్తూ క్షణం రెస్టు లేకుండా ఉన్నాడు. వర్క్‌లోడ్ ఎక్కువయి చస్తున్నాడు. పుణ్యాలు ఎలాగు తక్కువే కాబట్టి వాటిని లెక్కపెడుతూ స్వర్గంలో కాలక్షేపం చేస్తాడు సరేనా! అన్నాడు యమధర్మరాజు.

"అయ్యో! పాపం అలాగా! యమధర్మరాజా ఒక పనిచేద్దాం. నరకాన్ని క్లోజ్ చేద్దాం. ఎలాగూ తప్పు చేసినవాళ్లను శిక్షించడానికి భూలోకంలో పెద్ద పెద్ద జైళ్లు ఉన్నాయి. వాటిలో ఎంతో మంది శిక్షలు అనుభవిస్తున్నారు. చచ్చినా సుఖం లేకుండా మళ్లీ వాళ్లను నరకానికి తీసుకొచ్చి శిక్షించడం ఎందుకు ? తప్పులు చేసేవారికి మరణమే లేకుండా చేద్దాం... 'పాపీ చిరాయువు' అనే మాట ఎప్పటినుంచో ఉంది. అది కూడా సార్థకమవుతుంది. మనిషి చనిపోయాడంటే అతడు వెళ్లేది గ్యారంటీగా స్వర్గానికే అన్నమాట రూఢి అయిపోతోంది. 'పోయినోళ్లంతా మంచోళ్లు' అన్న సినిమా పాట కూడా ఎలాగూ ఉంది కదా! పుణ్యం చేసుకున్నవాళ్లే చనిపోతారు. స్వర్గానికి వచ్చి సుఖాలు అనుభవిస్తారు. ఇలా చేయడం వల్ల మృతులను నరకానికి తీసుకువచ్చే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులూ తప్పుతాయి.

నరకం మెయిన్‌టెన్స్ ఖర్చులు మిగులుతాయి. నరకం బిల్డింగ్ ఎవరికన్నా లీజుకిచ్చి మీరిద్దరూ, నేనూ స్వర్గంలోనే హాయిగా కాలక్షేపం చేద్దాం' అని ఇంద్రుడు చెప్పేసరికి యమధర్మరాజుకూ నచ్చింది. దాంతో పాపాత్ముల మరణాలు ఆగిపోయాయి. స్వర్గంలో ఎంత హాయిలే హలా అనుకుంటున్నారు.

చలో స్వర్గం!



హాస్యబ్రహ్మ

డా॥ శంకరనారాయణ

హాస్యబ్రహ్మగా ప్రఖ్యాతి వహించిన శంకరనారాయణ అంతర్జాతీయ కళాకారులు, ప్రముఖ పాత్రికేయులు. తన హాస్యావధానంతో లిమ్కాబుక్ రికార్డ్స్‌లో రెండుసార్లు స్థానం సంపాదించుకున్నారు. పాత్రికేయరంగంలో 34 సంవత్సరాల పాటు వివిధ పత్రికల్లో వివిధ సంపాదక హోదాల్లో పనిచేసిన శంకరనారాయణ ఈనాడులో సీనియర్ చీఫ్ సబ్‌ఎడిటర్‌గా పదవీ విరమణ చేశారు.

దేశవిదేశాలలో 381 హాస్యావధానాలు చేశారు, ఇంకా చేస్తూనే ఉన్నారు.

ఫన్‌గన్, ఫన్‌దేహాలు, పన్ పరాగ్, శంకరనారాయణ అప్రస్తుతప్రసంగాలు, అగ్నిసంగీతం, నవ్వే నజరానా, మీ నవ్వు మీ ఇష్టం, కనకదుర్గ శతకం, తీగలాగిన భార్య, ఇంగ్లిష్‌కు తల్లి తెలుగు వంటి ఎన్నో రచనలు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, కమలాకర ట్రస్టు జీవిత సాఫల్య పురస్కారం, టాన్‌టెక్స్ (డల్లాస్ - అమెరికా) అవార్డు వంటి ఎన్నో పురస్కారాలు పొందారు.

టెలిఫన్ (టీవీ సీరియల్); ప్రతిరోజా సీటీవీలో విట్‌నెస్; సప్తగిరి ఛానల్ (దూరదర్శన్) లో నవ్వుల సవాల్ నిర్వహిస్తున్నారు.

తీగలాగే భార్య

(నవ్వుల జడ దెబ్బలు)

SRI RAGHAVENDRA S.R. BOOK LINKS
Tel : (0866) 2436959, 2438959, (+91) 8142444988
D.No. 31-13-18, Danaiah St., Machavaram,
VIJAYAWADA-520 004.
e-mail : srbooklinks@gmail.com Fax : 0866-2431959

Price ₹ 99

Product ID :0866